ప్రజాశక్తి

మంగళవారం 28 మే 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

రూ.లక్షకు రూ.2 లక్షలు.!

- బెట్టింగుల్లో ముందున్న టిడిపి శ్రేణులు
- రాష్ట్రంలో కూటమి వస్తుందనే దానిపైనే పందేలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

బెట్టింగుల్లో తెలుగుదేశం నేతలే ముందున్నారు. జిల్లాలో ఎవరెక్కడ గెలుస్తారనే దానిపై కంటే రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందనే దానిపై ఎక్కువగా బెట్టింగ్ పెడుతున్నారు. ఎవరైనా బెట్టింగులు పెట్టొచ్చంటూ సవాలు విసురుతున్నారు. వైసిపి శ్రేణుల నుంచి పెద్దగా స్పందన లేదనే చర్చ కూడా సాగుతోంది. రూ.లక్షకు రూ.రెండు లక్షలు ఇస్తామంటూ పందేలకు సిద్ధమా?అని తెలుగుదేశం నేతలు రాజకీయవర్గాల్లోకి చర్చను తీసుకుపోయారు. అయితే ఎక్కడా వైసిపి నేతలు కారణలేమైనా ముందుకు రావడం లేదు. గట్టిగా గెలుస్తామన్న స్థానాలపైనే వస్తున్నారు. దీంతో బెట్టింగులపై చర్చలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఎవరు పెట్టారనేదీ స్పష్టత లేదు. నువ్వానేనా అన్నట్లుగా ఉన్నచోట్ల గతంలో బెట్టింగులు పెట్టిన వారికి కూడా పరిస్థితి అంతుచిక్కడం లేదు. అభ్యర్థులతో మాట్లాడినా స్పష్టత రావడం లేదు. ధీమాలు తప్ప గెలుపు తథ్యమనే పరిస్థితి కనిపించడం లేదు. గెలుపునకు అవకాశాలున్న స్థానాల్లోనూ ఐదారు వేల మెజార్టీ చెబుతున్నారు. దీంతో ఈ మెజార్టీలను నమ్ముకొని మునుగుతామని కొందరు బెంబేలెత్తుతున్నారు. మరో వైపు కేంద్ర మంత్రి అమిత్‌షా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందని ప్రకటించారు. ఇది కూడా తెలుగుదేశం నేతలకు మరింత ఊపునిస్తోంది. ఈ ప్రకటన కూడా వైసిపి వర్గాల్లో కొంత కలవరపాటుకు గురిచేస్తోంది. కేంద్రం అంచనాలో కూటమి ఉందా? అనేదీ చర్చ సాగుతోంది. మరో వైపు వైసిపి రాష్ట్ర నాయకత్వం అంచనాల్లోనూ 90 నుంచి 95 స్థానాలే గ్యారంటీగా గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. రెండు పార్టీలకు పెద్ద తేడా కనిపించడం లేదు. ఈ పరిస్థితుల్లో అధికారంపై ఉత్కంఠగానే చర్చ సాగుతోంది. అందరూ ఎగ్జిట్‌పోల్స్ కోసం ఎదురుచూస్తున్నారు. వాటిల్లో ▶ 2లో

రుధిర దారులు.!

- రోజూ ఏదొక చోట రోడ్డు ప్రమాదాలు
- రహదారి భద్రతపై లోపించిన పర్యవేక్షణ
- అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగే కారణం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రహదారులపై ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వాళ్లు క్షేమంగా తిరిగి వస్తారా.? అనే విషయం సందేహంగా మారింది. వాహనంతో రోడ్డు ఎక్కితే ఎటు వైపు నుంచి ప్రమాదం పొంచి ఉందో కూడా అర్థం కాని రీతిలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు వాహనచోదకులు అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్న కారణంగా ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ప్రమాదాలు జరగకుండా అధికార యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు నిరుపయోగం అవుతున్నాయి. వాహనదారులు కనీస భద్రతాప్రమాణాలు పాటించకపోవడం, మద్యం సేవించి వాహనాలను నడపడం, రోడ్డు నిర్మాణాలు లోపభూయిష్టంగా ఉండడం తదితర కారణాలతో జాతీయ రహదారులతో పాటు గ్రామీణ రోడ్లపై కూడా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి.

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రహదారిలో పర్చూరు సమీపంలో ప్రైవేట్ బస్సు, టిప్పర్ ఢీకొన్న దృశ్యం (ఫైల్)

ఇటీవల యద్దనపూడి వద్ద రోడ్డుపై ఉన్న గుంత కారణంగా బైక్‌పై వస్తున్న ఉపాధ్యాయుడు అదుపుతప్పి.. కిందపడి మృతి చెందాడు. వాడరేవు-పర్చూరు-పిడుగురాళ్ల రహదారి పనులు జరుగుతున్న క్రమంలో ఇరుకు రోడ్డులో వేగంగా వస్తున్న బస్సు, టిప్పర్ ఢీకొని ఆరుగురు మరణించారు. ఈ రోడ్డులో మరియు జాతీయ రహదారిలో మార్టూరు వద్ద తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

జిల్లా పరిధిలో దిగమర్రు-ఒంగోలు 216 జాతీయ రహదారి, చెన్నై- కోల్‌కత్తా 16 జాతీయ రహదారి, నార్కెట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల నామ్ రహదారి, వాడరేవు-పిడుగురాళ్ల రహదారులు ఉన్నాయి. ఈ నాలుగు రహదారులతో పాటు జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న రోడ్లపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ప్రతి శనివారం పోలీస్ అధికారులు నో యాక్సిడెంట్స్ డేను క్రమం తప్పకుండా నిర్వహించేవారు. రహదారి ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన చర్యల గురించి అవగాహన కల్పించేవారు. అయినప్పటికీ పలు రకాల కారణాలతో రహదారి ప్రమాదాలు నిత్యం జరుగుతూనే వచ్చాయి. ఎన్నికల సమయం కావడంతో పోలీస్ ▶ 2లో

కౌంటింగ్‌పై సూచనలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఓట్ల లెక్కింపుపై అవగాహన అవసరం

- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు అత్యంత కీలకం
- కలెక్టర్ దినేష్‌కుమార్

▲ 2లో

సమాజాన్ని చైతన్యపరిచేవే నాటికలు

- రోటరీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి
- మార్టూరులో తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు ప్రారంభం

'నిశ్శబ్దమా..' నాటికలోని ఓ సన్నివేశం

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ఆర్థిక మూలాలే ప్రధానంగా భావిస్తున్న నేటి సమాజంలో నాటక రంగం సమాజాన్ని చైతన్యపరిచేందుకు కృషి చేస్తుందని 3150 రోటరీ గవర్నర్ డాక్టర్ బూసిరెడ్డి శంకరరెడ్డి అన్నారు. శ్రీకారం స్వచ్ఛంద సేవా సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు సౌజన్యంతో శ్రీకారం రోటరీ కళాపరిషత్ 14వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు సోమవారం బాపట్ల జిల్లా, మార్టూరులో ప్రారంభమయ్యాయి. ముందుగా నటరాజ పూజతో కార్యక్రమం ప్రారంభించగా శ్రీకారం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు జాష్టి అనురాధ, ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు జ్యోతి ప్రజ్వలన చేశారు. ముఖ్య అతిథులుగా విశ్రాంత ఐఎఎస్ అధికారి, ఎన్టీఆర్ ట్రస్ట్ ట్రస్టీ డాక్టర్ పి.క్రిష్ణయ్య, జనవిజ్ఞానవేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, రోటరీ పూర్వ గవర్నర్ ఏఆర్ ప్రభాకర్ మాట్లాడుతూ నాటకరంగం కనుమరుగవుతున్న తరుణంలో 13 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతంలో శ్రీకారం రోటరీ కళాపరిషత్ ద్వారా సమాజంలో సామాజిక బాధ్యతను పెంపొందించడానికి జాతీయ స్థాయి నాటికల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రోటరీ గవర్నర్ డాక్టర్ బి.శంకర్‌రెడ్డి నాటిక పోటీలను ప్రారంభించారు. ముందుగా శ్రీ అమృత లహరి ఆర్ట్స్ విజయవాడ ఆధ్వర్యంలో ▶ 2లో

టంగుటూరి ప్రకాశం పంతులు

మనవడు గోపాలకృష్ణ మృతి

- హైదరాబాద్‌లో ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు మనవడు టంగుటూరి గోపాలకృష్ణ (59) సోమవారం హైదరాబాద్‌లో వారి కుమారుని ఇంట మృతిచెందారు. ఆయనకు భార్య విజయ లలిత, కుమారులు టంగుటూరి సాయిక్రాంత్, టంగుటూరి ప్రకాష్ ఉన్నారు. గోపాలకృష్ణ అంత్యక్రియలు సోమవారం హైదరాబాద్‌లో ముగిశాయి.

గోపాలకృష్ణ (ఫైల్)

టంగుటూరి ప్రకాశం పంతులు రెండో కుమారుడైన హనుమంతరావు, అన్నపూర్ణాదేవి దంపతులకు టంగుటూరి గోపాలకష్ణ ఒంగోలులో జన్మించారు. 1993లో కమర్షియల్ టాక్స్ కార్యాలయంలో రికార్డు అసిస్టెంట్ గా ఉద్యోగంలో చేరి, 2016 డిసెంబరు 31న స్వచ్ఛంధ ఉద్యోగ విరమణ చేశారు. టంగుటూరి గోపాలకృష్ణ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, గణతంత్ర దినోత్సవ వేడుకలు, ప్రకాశం పంతులు జయంతి, వర్ధంతి కార్యక్రమాలలో పాల్గొంటూ తమ తాత పోరాట పటిమను గుర్తుచేస్తుండేవారు. గోపాలకృష్ణ చాలా కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే గోపాలకృష్ణ మృతికి పలువురు పాత్రికేయులు నెమ్మాని సీతారామమూర్తి, యంవిఎస్ శాస్త్రి, రాధా రమణ గుప్తా జంధ్యం, పొన్నూరు వేంకట శ్రీనివాసులు, మైనంపాటి సాయి, యువి రత్నం సంతాపం ప్రకటించారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

గోపాలకృష్ణ మృతి బాధాకరం

మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి

టంగుటూరి గోపాలకష్ణ మృతి బాధాకరమని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి విచారం వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. దేశానికి వారి కుటుంబ సేవలు నిరూపమానమని కొనియాడారు. ఆ కుటుంబానికి ఎల్ల వేళల అండగా ఉంటానని బాలినేని పేర్కొన్నారు.

మాగుంట సంతాపం

టంగుటూరి గోపాలకృష్ణ ఆకస్మిక మతిపై ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతాపం ప్రకటించారు. గోపాలకృష్ణ మరణవార్త తనకు ఎంతో దిగ్భ్రాంతి కలిగించిందని, మంచితనానికి ఆయన నిలువెత్తు దర్పణమన్నారు. ఆయన లేకపోవడం వారి కుటుంబానికి తీరని లోటు తెలిపారు.

రుధిర దారులు

(మొదటిపేజీ తరువాయి)

యంత్రాంగం యావత్తు ఆ విధుల్లో ఉండి గత కొంతకాలంగా నో యాక్సిడెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం లేదు.

అండర్ పాసుల నిర్మాణాలు లేక ప్రమాదాలు

జాతీయ రహదారులపై ముఖ్యమైన జంక్షన్ల వద్ద అండర్‌పాస్‌లు నిర్మించాలన్న ప్రతిపాదనలు అమలుకు నోచుకోలేదు. దిగమర్రు–ఒంగోలు జాతీయరహదారిలో గ్రామాలకు దారి తీసే పలు ప్రాంతాల్లో అండర్ పాసుల నిర్మాణాలు జరపాలన్న ప్రతిపాదనలు చేశారు. అవి అమలుకు నోచుకోలేదు. దీంతో ఈ జాతీయ రహదారిని దాటుతూ తమ గ్రామాలకు వెళ్లే వారు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాటు జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉండే సర్వీస్ రోడ్ల జంక్షన్ల వద్ద అధికంగా రోడ్డుప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్లపై స్పీడ్‌బ్రేకర్లు లేకపోవడంతో జంక్షన్ల వద్ద రెండు వైపుల నుంచి వేగంగా వస్తున్న వాహనాలు ఢీ కొంటున్నాయి. అలాగే రహదార్లపై వాహనాల వేగనిరోధం కోసం ఉంచిన బారికేడ్లు ఒక క్రమపద్ధతిలో ఉండడం లేదు. కొన్ని చోట్ల బారికేడ్స్ రెండు వైపులా దగ్గరగా ఉండటం వల్ల వాహనాలు జిగ్‌జాగ్‌గా వెళ్లాల్సి వస్తుంది. ఇవి కూడా అన్ని చోట్లా లేవు. రహదారిపై ఉంచిన ఇనుప బారికేడ్స్, ఇసుకతో నింపిన డ్రమ్ములకు సంబంధించి రేడియం స్టిక్కర్లు సక్రమంగా లేకపోవడంతో రాత్రి సమయాల్లో వాహనాలకు సదరు బారికేడ్స్ కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల బారికేడ్స్ గురించి పోలీస్ యంత్రాంగం పట్టించుకునే పరిస్థితి లేకపోవడంతో అవి రోడ్లపై ఎలాపడితే అలా ఉంటున్నాయి. జిల్లా పరిధిలో చిన్నగంజాం నుండి రేపల్లె వరకు ఉన్న 216 జాతీయ రహదారి 97 కి.మీ.ల పొడవున ఉంది. చినగంజాం వద్ద నిర్మించిన రెండు బ్రిడ్జిల నిర్మాణం లోపభూయిష్టంగా ఉంది. ఇక్కడ రహదారి, ఫ్లై ఓవర్ బ్రిడ్జిల అనుసంధానం సక్రమంగా లేదు. ఇలా ఈ మార్గంలో ఉన్న అన్ని బ్రిడ్జిల వద్ద ఇదే పరిస్థితి ఉంది. బ్రిడ్జి మరియు రహదారి కలిసే చోట జాయింట్లు సక్రమంగా కలవని కారణంగా వాహనాలు ఎగిరి పడుతున్నాయి. రోడ్డు కుంగడం జరుగుతుంది. అక్కడక్కడా రోడ్లపై ఏర్పడిన గుంటలను తప్పించే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం జాతీయ రహదారులపైనే అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు గుర్తించారు. గ్రామీణ రోడ్లపై కూడా ఏర్పడిన గుంటల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా అద్దంకి నామ్ రహదారిపై, చీరాల వద్ద 216 జాతీయ రహదారిపై, వాడరేవు–పిడుగురాళ్ల రహదారిలో పర్చూరు, కారంచేడుల మధ్య రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలకు గల కారణాలను శాస్త్రీయంగా గుర్తించి తగిన నివారణ చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగం వైఫల్యం చెందుతుంది.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం అధికారులు తీసుకునే చర్యలతో పాటు వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ సురక్షిత ప్రయాణం చెయ్యాలి.

రోడ్డుప్రమాదాల నివారణా చర్యలు చేపట్టాలి

జిల్లా పరిధిలో పలు చోట్ల ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉన్న బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించినప్పటికీ ఆ ప్రాంతాలలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్స్ వద్ద యుద్ధ ప్రాతిపదికన హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ ప్రాంతాలలో వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. బారికేడ్లు, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటుచేయాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని జిల్లాలో మరింత విస్తృతంగా చేపట్టాలి. మరమ్మతులకు గురైన వాహనాలు అలానే రోడ్లపై ఉంచకుండా తక్షణమే అక్కడి నుంచి వాటిని తొలగించాలి.

విద్యార్థులకు కోలాటంపై శిక్షణ

పెద్దదోర్నాల : వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కోలాటంపై సోమ వారం శిక్షణ ఇచ్చారు. గ్రంథపాలకుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థుల చేత కథలు చదివించడం, కథలు చెప్పించడం చేశారు. మాథ్స్ టీచర్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మాథ్స్‌లో మెలుకువలు నేర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై చర్చాగోష్టి

ప్రజాశక్తి -ఒంగోలు సబర్బన్

మంచి నీటి సమస్యపై ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి చర్చా గోష్టి నిర్వహించారు. కొప్పోలు గ్రామ సచివాలయం వద్ద నాదెండ్ల మల్లికార్జునరావు మాష్టారు ఆధ్యక్షతన చర్చా గోష్టి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 100 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. 15 మంది చర్చాగోష్టిలో పాల్గొని విలువైన సూచనలు, సలహాలు చేశారు. ప్రతి రోజూ తాగునీరు సరఫరా చేసేందుకు కొప్పోలు మంచినీటి చెరువును సమ్మర్ స్టోరేజ్–3 అభివృద్ధి చేయాలన్నారు. ప్రజలకు ప్రతిరోజూ 3 గంటల నిడివితో నీరు సరఫరా చేయాలని అభిప్రాయపడ్డారు. ఓపెన్ కాలువ ద్వారా కాకుండా పెద్ద కన్సిల్ పైపులు ద్వారా సాగర్ నీటితో చెరువు నింపాలన్నారు. అధికారులు జోక్యం చేసుకొని మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారంగా కొప్పోలు చెరువును సమ్మర్ స్టోరేజ్–ట్యాంక్‌గా అభివృద్ధి చేయాలని తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమో దించారు. అనంతరం మంచి నీటిసాధన కమిటీ ఎన్నుకు న్నారు. గౌరవాధ్యక్షుడిగా నాదెండ్ల మల్లికార్జున రావు, సభ్యులు షేక్ శీను భాషా, నడిపినేని భాస్కర్, శింగంనేని హనుమంతరావు, మద్దిర ఆదినారాయణ, బట్టు వెంకట్రావు, ఆవులమంద ఆంజనేయులు, దాసరి జయరావు, బుజ్జిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ నాగేశ్వరరావు, కాట్రగడ్డ రఘుపతి, రైల్వే యూనియన్ నాయకులు సుధీర్, రైతు సంఘం జిల్లా నాయకుడు పెండ్యాల హనుమంతరావు, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చర్చాగోష్టిలో పాల్గొన్న గ్రామస్తులు, ప్రముఖులు

చిన్నారికి బూచేపల్లి ఆశీర్వాదం

దర్శి : దర్శి మండలం కొత్త వెంకటాపురం గ్రామంలో బాదం నాగిరెడ్డి కుమార్తె పుష్పాలంకరణ వేడుకల్లో సోమవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు.ఈ అదేవిధంగా మండల పరిధిలోని లంకో జనపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త ఎబ్బిలి నరసింహారావు గుండెపోటుతో మృతి చెందాడు. అందులో భాగంగా వైసిపి దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రూ.లక్షకు రూ.2 లక్షలు.!

(మొదటిపేజీ తరువాయి)

తేలిపోతుందనే భావనలో ఉన్నారు. సర్వత్రా ఉత్కంఠ పెరుగుతోంది. పోటీచేసిన అభ్యర్థులు పోలింగు అనంతరం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. కొందరు గుడులు, గోపురాల చుట్టూ తిరిగి నియోజకవర్గాలకు చేరుకున్నారు. మండలస్థాయి నేతలతో సమీక్షలు పెడుతున్నారు. మెజార్టీలపై అంచనాలకు వస్తున్నా.. మరోవైపు లెక్కింపు సమయం రానే వస్తోంది. అధికారులూ అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అభ్యర్థుల శిబిరాల్లో ఉత్కంఠగానే మెజార్టీలపై సమీక్షలు నడుస్తున్నాయి. కూడికలు, తీసివేతలు కొనసాగుతున్నాయి. కొందరు గెలుపుపై గట్టి ధీమాలో ఉండగా కొందరికి స్పష్టత లేక మార్జిన్‌లో బయటపడతామనే ఆశతో ఉన్నారు.

సమాజాన్ని చైతన్యపరిచేవే నాటికలు

(మొదటిపేజీ తరువాయి)

అమృతలహరి దర్శకత్వంలో తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించిన 'నాన్న నేనొచ్చేస్తా..' నాటిక పెళ్లి అనంతరం అత్తగారి ఇంటికి వెళ్లిన కూతురు 'నాన్నా.. నేనొచ్చేస్తా..' అన్న మాటకు స్పష్టి పలికి 'నాన్న మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారు.?' అని ఆహ్వానం పలికే రోజులు వస్తే అప్పుడే పవిత్రమైన భార్యాభర్తల మధ్య బంధం బలపడి.. ఆ వైవాహిక జీవితంలో నిత్య నూతన శతవసంతాలు బలపడతాయని సందేశమిచ్చిన ఈ నాటిక ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసింది. అనంతరం విశాఖపట్నం తెలుగు కళాసమితి ఆధ్వర్యంలో చలసాని కృష్ణప్రసాద్ దర్శకత్వంలో పీటీ మాధవ్ రచించిన 'నిశ్శబ్దమా.. నీ ఖరీదెంత..' కుటుంబ వ్యవస్థలో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడానికి చట్టంలో చేసిన కొన్ని మార్పుల వల్ల వాస్తవంగా కష్టాలు, కన్నీళ్లు అనుభవిస్తున్న బాధితులకు గాథలను కళ్ళకు కట్టినట్టు నటీ నటులు ప్రదర్శించడం పలువురిని ఆకట్టుకుంది. చివరిగా ప్రదర్శించిన వీరన్నపాలెం కళానికేతన్ ఆధ్వర్యంలో సిహెచ్ సాయిబాబు దర్శకత్వంలో శ్రీ శివన్నారాయణ రచించిన రాజు గారి 'గోచి' నాటికలో నేరం చేసిన నిందితుడికి శిక్ష పడే కంటే ఆ నేరం వల్ల రోడ్డున పడి అనాథలైన బాధితుల్ని ఆదుకోవాలని సందేశమిచ్చిన ఈ నాటిక ప్రేక్షకులను ఆలోచింపచేసింది. అనంతరం వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన జివి సేతురామన్, వసంత సేతురామన్‌లను శ్రీకారం–రోటరీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఇంటూరి ఆంజనేయులు, అధ్యక్ష, కార్యదర్శులు తాళ్లూరి సాంబశివరావు, మద్దుమాల కోటేశ్వరరావు, రావి అంకమ్మచౌదరి, ఎమ్ ఈశ్వరప్రసాద్, షేక్ ఖాజా హుస్సేన్, కందిమళ్ల రవిబాబు, కొర్రపాటి ఖాజారావు, చెరుకూరి అంజిబాబు పాల్గొన్నారు.

నేడు ప్రదర్శించే నాటికలు

మార్టూరు శ్రీకారం–రోటరీ కళాపరిషత్ సమర్పణలో నాయుడు గోపి దర్శకత్వంలో జాష్టి వెంకట మోహనరావు రచించిన రైతు భారతం, పొన్నూరు రసరుచి సమర్పణలో వైఎస్ కృష్ణేశ్వరరావు దర్శకత్వంలో వై భాస్కరరావు రచించిన కాపలా, హైదరాబాద్ కళాంజలి సమర్పణలో కొల్లా రాధాకృష్ణ దర్శకత్వంలో కంచర్ల సూర్యప్రకాష్ రచించిన రైతేరాజు, విజయవాడ మైత్రి కళానిలయం సమర్పణలో టివి పురుషోత్తం దర్శకత్వంలో మాడుగుల రామకృష్ణ రచించిన బంధం నాటికలు మంగళవారం ప్రదర్శించనున్నారు.

గెలుపు మనదే : గూడూరి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో కొత్త చరిత్ర సృష్టించబోతున్నామని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఐదు మండలాల ముఖ్య నాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో తాను తప్పక గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. జూన్ 4న కౌంటింగ్‌లో పాల్గొనే ఏజెంట్లకు పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి బోడా చెన్న వీరయ్య నాయుడు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, మంత్రు నాయక్, మస్తాన్‌వలి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మా క్లయింటు అయిన ప్రకాశంజిల్లా కనిగిరి కాపురస్తుడు పెరుగు వెంకటేశ్వర్లు గారి కుమారుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ మాకిచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా.

మా క్లయింటు మరియు అతని భార్య డాక్టర్ ఎన్నాబత్తిన హరిత గారు జాయింటు గా తేది. 27–09–2012న ఒంగోలు S.R.O లో దాక్యుమెంటు నెం. 8690/2012 గా రిజిష్టరు కాబడిన ఒంగోలు T.S. No. 717 లో నిర్మించిన శ్రీ గోపాల నివాసం అపార్ట్ మెంట్ లో ఫ్లాటు నెం. 302 ను కొనుగోలు చేసి అనుభవించుచున్నారు కాగా మా క్లయింటు సదరు దాక్యుమెంటును జిరాక్స్ తీసుకొను నిమిత్తం ఒంగోలు జిల్లా కోర్టు ఎదురుగా జిరాక్స్ తీసుకొని వెళు తున్న సమయంలో దాక్యుమెంటులోని 12వ పేజి అనగా కొనుగోలు దార్ల పేరు వివరములు గల ఫోటో ఫారం కనబడకుండా పోయినది కావున యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు దాక్యుమెంటులోని 12వ పేజి దొరికిన యెడల క్రింది చిరునామాలో అందించవలసినది.

ఇట్లు
పాదర్తి ఆదిశేషు
పాదర్తి సత్య శ్రీలేఖ
న్యాయవాదులు
జిల్లా కోర్టు క్యాంటిన్ ఎదురు, ఒంగోలు
సెల్: 98493 76225

తహశీల్దారుకు వినతి

గిద్దలూరు రూరల్ : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల సన్నివేశాలు చిత్రీకరించిన వీడియో గ్రాఫర్లకు బిల్లులు చెల్లించాలని కోరుతూ డిప్యూటీ తహశీల్దారు సుబ్బారావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీడియో గ్రాఫర్లు మాట్లాడుతూ ఎన్నికలు జరిగి 56 రోజులు గడిచినప్పటికీ ఇంత వరకూ నగదు చెల్లించలేదని తెలిపారు.స్పందించిన డిప్యూటీ తహశీల్దారు వీడియో గ్రాఫర్ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

BEFORE THE HON' BLE DEPUTY REGISTRAR OF CHITS: BAPATLA

DISPUTE NO. 29/2022

Between:
M/s Shriram Chits Pvt. Ltd.., Repalle
..Disputant
And Shaik Mubeena andothers
...Opponents

1.Shaik Mubeena. D/o Nasuruddin, Muslim aged 34 years. Business and R/o D.No.141- 7-6. Bethapudi, (V). Repalle, Mandal Bapatla District.

Please take notice that the above dispute is filed against opponent no 1 and 4. for recovery of amount. The same is posted to Dt. 11.06.2024, for the appearance of you before the deputy registrar of chits office district registrar, Bapatla at 10.30 a.m. If you fail to attend the office of Deputy Registrar of chits on that day the matter will be heard and decided exparte basis on the material available.

(By Order of the Deputy Registrar of chits)
Rep by its legal Manager/GPA Holder,

BEFORE THE HON' BLE DEPUTY REGISTRAR OF CHITS: BAPATLA

DISPUTE NO. 17/2021

Between:
M/s Shriram Chits Pvt. Ltd., Repalle
... Disputant
AndSnaik Mahamudunissa and others
... Opponents

1. Shaik Mahamudunissa. W/o Nasuridain, Muslim, aged 55 years. Business and R/o D.No.141-7-6, Bethapudi (V), Repalle, Mandal bapatla District.
4. Shaik Mubeena, D/o Nasuruddin, Muslim, aged 34 years. Business and R/o D.No.141- 7-6, Bethapudi, (V), Repalle, Mandal Bapatla District.

Please take notice that the above dispute is filed against opponent no 1and 4. for recovery of amount. The same is posted to Dt. 11.06.2024, for the appearance of you before the deputy registrar of chits office district registrar Bapatla at 10.30 am. If you fail to attend the office of Deputy Registrar of chits on that day the matter will be heard and decided exparte basis on the material available.

(By Order of the Deputy Registrar of chits)
Rep by its Legal Manager/GPA Holder.
Shriram Chits Pvt., Ltd. Repalle.

మహారాజశ్రీ గౌరవ 3 వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,ఒంగోలు

OS NO : 1354/2022

Between
కాంతారావు యాళ్ళ ... వాది
వర్సెస్
మేదరమెట్ల రమణయ్య మరియు ఇద్దరు
... ప్రతివాదులు

To
D3) మార్తా కోటేశ్వరరావు,
తండ్రి తెలియదు, నివాసం మర్రిచెట్టపాలెం,
బూదవాడ గ్రామం, చీమకుర్తి మండలం,
ప్రకాశం జిల్లా.

ఇందుమూలముగా పత్రికా ముఖంగా తెలియజేయునది ఏమనగా పై దావా నందు D3 కు సమన్లు అందని కారణమున గౌరవ కోర్టు వారు ఇచ్చిన ఉత్తర్వుల మేరకు ఇస్తున్న సమను నోటీసు వాయిదా తేదీ 18-07-2024న పై దావా నందు D3 స్వయంగా గాని లేదా మీ వకీలు ద్వారా గాని ఉదయం 10:30కి హాజరై సంజాయిషీ ఇచ్చుకో వాల్సిందిగా తెలియపరచడమైనది. అట్లు కాని ఎడల మీ పరోక్షములో పై దావా విచారించబడునని పత్రికా ముఖంగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
కుర్రి బ్రహ్మారెడ్డి
అడ్వకేట్,ఒంగోలు

అవమానం తాళలేక..

- రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య
- మృతుడి ఆచూకీ లభ్యం
- పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసిన అసలు నిజం

రైలు కింద ఆత్మహత్య చేస్తున్న సుధాకర్ (ఫైల్)

ప్రజాశక్తి-శింగరాయకొండ

గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి ఆదివారం ఆత్మహత్యకు పాల్పడిన సంగతి తెలిసిందే. మృతుడి ఆచూకీ సోమవారం లభ్యమైంది. మృతుడు శింగరాయకొండ మండలం బింగినపల్లి పంచాయతీ పరిధిలోని పెద్దనబోయినపాలెంకు చెందిన కోమట్ల సుధాకర్‌గా గుర్తించారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో బింగినపల్లికి ఓ వ్యక్తి తనపై దాడి జరిగిందంటూ పోలీసులు ఫిర్యాదు చేశాడు. తమ కుమారు కనిపించడం లేదంటూ మృతుడు సుధాకర్ బంధువులు కూడా అదే సమయంలో ఫిర్యాదుకు చేశారు. ఆ ఫిర్యాదులను పరిశీలించిన ఎస్ఐ శ్రీరామ్ రైలు కింద హత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి ఫొటో చూపారు. మృతుడు తమ కుమారుడేనని ఆయన తండ్రి తెలిపాడు. ఇంతకు అసలు ఏం జరిగిందని పోలీసులు ఆరా తీయగా అసలు విషయం బయట పడింది. బింగినపల్లి వద్ద ఉప్పుకొటార్ల వద్ద కోమట్ల సుధాకర్ అనే వ్యక్తిపై దాడి చేసినట్లు తెలిసింది. ఆ అవమానం తాళలేక సుధాకర్ సోమరాజు పల్లి గేటు వద్దకు వచ్చి గేట్ మ్యాన్ ఎంత బతిమిలాడినా వినకొండ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది. ఈ గొడవ వెనుక కారణంపై ఆరా తీయగా ఓ జంట ప్రేమ వ్యవహారంలో కోమట్ల సుధాకర్ బంధువు ఉన్నట్లు తెలిసింది. గతంలో పోలీస్ స్టేషన్ కూడా పిలిపించి హెచ్చరించినా అతడి విషయంలో ఎలాంటి మార్పు లేదు. దీంతో అమ్మాయి బంధువులు సుధాకర్‌పై దాడి చేస్తే ప్రేమికుడు బయపడతాడన్న ఉద్దేశ్యంలో దాడి చేసినట్లు తెలిసింది. తన జరిగిన దాడిని అవమానంగా భావించి సుధాకర్ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో ఎలాంటి గొడవలు జరగకుండా ముందస్తు చర్యలో భాగంగా పోలీసులు కొందరి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రైల్వే పోలీసులు సుధాకర్‌ది ఆత్మహత్య కేసుగా నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను బంధువులకు అప్పగించారు. ఇరు గ్రూపుల వారు వైసిపికి చెందిన వారు కావడంతో పోలీసులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు.

28న కౌన్సిలింగ్

ప్రజాశక్తి-దర్శి

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో మిగిలిపోయిన సీట్లలో ఎస్‌పి విద్యార్థులకు నేరుగా ప్రవేశం కల్పించనున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ ఎస్.మాధవరావు తెలిపారు. అందుకోసం ఈనెల 28న స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కౌన్సిలింగ్‌కు గతంలో ప్రవేశ పరీక్ష రాసి సీటు రాని వారు, పరీక్షకు హాజరు కాని వారు కూడా తగిన ఆధారాలతో హాజరు కావచ్చుననితెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా వనమహోత్సవం

ప్రజాశక్తి- సిఎస్ పురంరూరల్

మండల పరిధిలోని డిజిపేట గ్రామంలో వనమహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. కోదండరామస్వామి వార్షిక కళ్యాణ మహోత్సవంలో భాగంగా వసంతోత్సవం, వనమహోత్సవం, పారువేట, లంకాదహనం, రావణ సంహారం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి పొంగళ్ళు సమర్పించారు. కటకం పెద్ద సుబ్బరాయుడు లక్ష్మమ్మ దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారులు కటకం వెంకట సత్యనారాయణ, ధనలక్ష్మి దంపతుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు కౌలు వేలం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు మండలం ఉప్పుగుండూరులోని శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ భూములకు సోమవారం కౌలు వేలం నిర్వహించారు. వేలం ద్వారా ఈ ఏడాది రూ.5.27లక్షల ఆదాయం పెరిగింది. శ్రీవేణుగోపాల స్వామి ఆళ్వారాజుల దేవస్థానానికి సంబంధించిన ఎ.52.89సెంట్లకు వేలం నిర్వహించారు. గతేడాది వేలం పాట ద్వారా రూ.9, 54,100 ఆదాయం వచ్చింది. ప్రస్తుతం రూ.13,30, 500 ఆదాయం సమకూరింది. శ్రీగౌరీశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి ఎ.24.89 సెంట్లకు కౌలు వేలం నిర్వహించగా రూ.4, 94,000 ఆదాయం సమకూరింది. శ్రీసుబ్రమణ్యేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన ఎ.7.35సెంట్లకు రూ.96 వేల ఆదాయం వచ్చింది. ఊరచెరువుకు సంబంధించి ఎ. 10.44 సెంట్లకు రూ.1,55,000 ఆదాయం సమకూరింది. మొత్తం మీద గతేడాది కంటే ఈ ఏడాది ఈ రూ.9, 54,100 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ , ఇఒలు మీనిశెట్టి శ్రీనివాసరావు, కావూరి శ్రీనివాస్ ,సిబ్బంది వేణు, సుబ్బారావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో నివసిస్తున్న రొంపిచర్ల ఖాదర్ మస్తాన్ షుగర్ వ్యాధి కారణంగా తన రెండు కాళ్ళను కోల్పోయాడు. ఆయన పెద్ద కుమారుడు పెద్దమస్తాన్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. దీంతో వారు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. వారికి వైద్య సేవలు, మెడిసిన్ ఖర్చులకు మానవతా సంస్థ తరపున రూ.15వేలు, దాతల ద్వారా రూ. 20వేలు కలిపి మొత్తం రూ.35 వేల ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. అదేవిధంగా మానవతా సంస్థ కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు కుమార్తె వెంకట రామ సాయి సుజిత స్పందించి ట్రై సైకిల్ అందజేస్తామని ప్రకటించాడు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ రీజనల్ చైర్మన్ రమణారెడ్డి , కోశాధికారి వాగిచర్ల వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఉమా కాంతు, మానవతా సంస్థ డైరెక్టర్ ఆర్ఎంపి డాక్టర్ శేఖర్, జాయింట్ సెక్రెటరీ బాబూరావు , కన్వీనర్ మాంటిసోరి పిచ్చిరెడ్డి , బారా ఇమామ్, ప్రకాష్ రావు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : డిఎస్‌పి

ప్రజాశక్తి కంభం రూరల్

ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మార్కాపురం డిఎస్‌పి బాలసుందరరావు తెలిపారు. కంభం పోలీస్ స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా కట్టుదిట్టంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయమైన ఘటనలకు చోటు చేసుకోకుండా ఎస్‌పి ఆదేశాల మేరకు పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు తావు లేకుండా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాపై కూడా నిఘా ఉంచినట్లు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా రెచ్చగొట్టే వారిని ఉపేక్షించమని తెలిపారు. ఎన్నికల ఫలితాల సమయంలో ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో కంభం సిఐ రామకోటయ్య, ఎస్ఐ పులి రాజేష్ పాల్గొన్నారు...

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మండల పరిధిలోని ఇష్టకామేశ్వరి, నెక్కంటి చెంచు గూడెంలో పాలుట్ల ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచులకు వైద్య పరీక్షలు నిర్వహించి సాధారణ వ్యాధులకు మందులు పంపిణీ చేశారు. జ్వరపీడితులకు రక్తపూతలు తీసి అవసరమైన మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు పరీక్షలు నిర్వహించారు. రక్తహీనతతో బాధ పడుతున్న రోగులకు ప్రొటీన్ పౌడర్లు, ఐరన్ టానిక్‌లు పంపిణీ చేశారు. చిన్నారులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని చెప్పారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది మాధవీ లత, జానారెడ్డి, కొండయ్య, సుజాత, నలగాటి వెంకట్రామయ్య నాయుడు పాల్గొన్నారు.

పంటల బీమా అందజేయాలి

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పంటలు నష్టపోయిన రైతులకు బీమా నగదు అందజేయాలని కోరుతూ ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయ సీనియర్ సహాయకులు లక్ష్మీరెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పంటలు నష్టపోయిన రైతులకు 90 శాతం రాయితీపై కంది, సజ్జ, పెసర విత్తనాలను సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, పి.వెంకటకొండయ్య, నాయకులు కె.కోటేశ్వరరావు, శ్రీను, మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: రైతులకు విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను ఉచితంగా సరఫరా చేయాలని, పంట నష్టపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ ఎపి రైతు సంఘం నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చెన్నయ్య తహశీల్దారుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ గతంలో పంటలు నష్టపోయిన రైతులకు ఇంత వరకూ నష్టపరిహారం చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో బి. గాలెయ్య, జి.చిన్న వెంకటేశ్వర్లు, ఎన్.సుబ్బారావు పాల్గొన్నారు.

మత్తిచ్చే..దోచేశారా.?

చికిత్స పొందుతూ..వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

స్థానిక అంబేద్కర్ భవన్, ఇందిరమ్మ కాలనీలో ఇటీవల వృద్ధురాలిపై దాడి చేసి.. బంగారు ఆభరణాలు చోరీ చేసిన కేసు పలు మలుపులు తిరుగుతోంది. సదరు వృద్ధురాలికి నిందితులు మత్తు ఇచ్చి..దోపిడీకి పాల్పడినట్లు తెలుస్తోంది. అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలు పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందారు.

అంబేద్కర్ భవన్ వద్ద ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న తిరుమలశెట్టి పార్వతమ్మ (82) భర్త సుబ్బారావు పోస్టల్ ఉద్యోగిగా పనిచేశారు. ఈయన చాన్నాళ్ల క్రితమే మృతిచెందారు. వచ్చే పింఛను డబ్బులతో ఒంటరిగానే ఆ ఇంటిలో పార్వతమ్మ నివాసముంటోంది. ఈ నెల 24న బంధువులు పార్వతమ్మ ఇంటికి వెళ్లగా.. ఇంటి బయట తలుపు గడి పెట్టి ఉండటం, లోపలికి వెళ్లి చూడగా ఆమె అపస్మారక స్థితిలో ఉంది. ఆమె మెడలో నగలు లేకపోవడాన్ని గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అపస్మారక స్థితిలో ఉన్న పార్వతమ్మను స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో ఆమె సోమవారం మృతిచెందారు. ఆమె బ్లడ్ శాంపిల్స్‌ను టెస్టులకు పంపగా.. ఆమెపై మత్తు ప్రయోగం జరిగినట్లు వైద్యులు నిర్ధారించారు. మత్తు ఇచ్చి.. ఆమె బంగారు ఆభరణాలు తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. పార్వతమ్మ మృతిచెందడంతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

చేపల వేటకు వెళ్లి నీటిలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన టంగుటూరు మండలం తేటుపురం గ్రామం వద్ద పాలేరు నదిలో సోమవారం వెలుగు చూసింది. చేపల వెళ్లిన కొందరు వ్యక్తులు పాలేరు వ్యక్తి మృతదేహం నీటిలో తేలాడుతూ ఉండటాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు 30 సంవత్సరాల వయసు కలిగి ఉంటాడని, చేపల వేటకు వచ్చి మృతిచెందినట్లు పోలీసులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

ఇంకొల్లు రూరల్ : అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఇంకొల్లులో సోమవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. స్థానిక మసీదు కాంప్లెక్స్ వద్ద చికెన్ పకోడి దుకాణంలో పని చేస్తున్న షేక్ నాగూర్‌వలి (40) అనుమానాస్పద స్థితిలో మతి చెందాడు. పమిడిపాడు గ్రామానికి చెందిన నాగూర్ వలి పొట్ట కూటి కోసం ఇంకొల్లు వచ్చి చికెన్ షాపు దుకాణంలో పని చేస్తున్నాడు. యజమాని వచ్చి చూసే సరికి బల్లపైన పడుకున్న వ్యక్తి కింద పడిపోయి ఉన్నాడు. పక్కకు జరిపితే ముక్కు నుండి రక్త స్రావం జరిగి అప్పటికే మతి చెంది ఉన్నాడు. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మల్లికార్జునరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. నాగూర్ వలి మతిపై ఆయన బంధువులు అనుమానాలు వ్యక్తం చేశారు.పోలీసుల అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

చేపల వేటకెళ్లి వ్యక్తి దుర్మరణం

ఇంకొల్లు రూరల్ : చెరువులో చేపలు వేటకు వెళ్లి వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన మండలంలోని కొణికి శివారు నలతోటివారిపాలెంలో సోమవారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గంగవరం గ్రామానికి చెందిన యాడికిరి సుబ్రహ్మణ్యం (50) చేపలు పట్టేందుకు నలతోటివారిపాలెం చెరువు వద్దకు వెళ్లాడు.రాత్రి అయినప్పటికీ ఇంటికి చేరలేదు. తెల్లవారే సరికి చెరువులో ఆయన మృతదేహం కనిపించాడు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మల్లికార్జునరావు ఘటనా స్థలానికి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వికలాంగులను గుర్తించేందుకే సర్వే చేస్తున్న దృశ్యం

వికలాంగుల సంక్షేమం కోసం సర్వే

ప్రజాశక్తి - పంగులూరు

రాష్ట్ర సమగ్ర శిక్ష ఆదేశాలు ప్రకారం 0 నుండి 18ఏళ్లలోపు దివ్యాంగులైన బాల, బాలికలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా సమన్వయకర్త ఎం జోష్ణ సోమవారం తెలిపారు. మండలంలో సర్వే నిర్వహించారు. ముప్పవరంలోని పంగులూరు రోడ్డులో ఒకే ఇంటిలో తాళ్లూరి బాలాజీ, గాయత్రి ఇద్దరు పిల్లలను ఆటిజం, భాషా లోపం కలిగి ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఇటువంటి పిల్లలకు భవిత కేంద్రం ఉంటుందని తెలిపారు. అక్కడ ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని తెలిపారు. ఆ కేంద్రంలో ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీ చేస్తారని చెప్పారు. ప్రభుత్వం నుండి కొన్ని రకాల అలవెన్సులు ఇస్తారని అన్నారు. చక్కటి విద్యా బుద్ధులు, సాంఘిక నైపుణ్యాలను నేర్పించి సాధారణ పాఠశాలలో చేర్పిస్తామని అన్నారు. ఇటువంటి అవకాశాన్ని తల్లి, దండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దివ్యాంగులు కూడా సమగ్ర శిక్ష అందించే ప్రతి సౌకర్యాన్ని ఉచితంగా పొందాలని అన్నారు. వారిలో ఉన్న లోపం కాక వారిలో ఉన్న నైపుణ్యాలను గుర్తించి ప్రోత్సహిస్తే జీవితంలో అభివృద్ధి చెందుతారని అన్నారు. అందుకే ప్రభుత్వం సర్వే చేపట్టిందని తెలిపారు. మే 1నుండి జూన్ 9వరకు రాపిడ్ సర్వే జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయులైన పి యోహాను, టి అరుణ పాల్గొన్నారు.

పురస్కారాలు అందిస్తున్న రోటరీ ప్రతినిధులు

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల్లోని 13 స్కూల్స్‌లో 10వ తరగతిలో పాఠశాల స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ప్రతిభా పురస్కారములు, ప్రశంసా పత్రాలు, విద్యార్థులకు అవసరమైన బ్యాగులు, మంచినీటి సీసాలు, వ్రాత సామాగ్రి సోమవారం అందజేశారు. సభకు క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. రోటరీ బేసిక్ ఎడ్యుకేషన్, అక్షరాస్యత జోనల్ చైర్మన్ పోపూరి లక్ష్మీనారాయణ, విశ్రాంత సెంట్రల్ ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ బిరుదు రవీంద్రనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మంచి విజయాలు సాధించాలని కోరారు. సమాజ అభివృద్ధికి తోడ్పడాలని ఆకాంక్షించారు. పాఠశాలలు అన్నింటికీ పరీక్షల సమయంలో ఎగ్జామ్స్ కిట్ అంద చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి పంబి సదా నందరెడ్డి, రోటరీ సభ్యులు గడ్డిపాటి శ్రీనివాసరావు, కోమటి ఆంజనేయులు, తోకల కృష్ణమోహన్, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, దండా శ్రీనివాసరావు, కారుముడి సుబ్బారెడ్డి, కోడూరి సుబ్రహ్మణ్యచారి, మున్నంగి వెంకట సుబ్బయ్య, విద్యార్థులు, తల్లి తండ్రులు, ఉపాధ్యాయులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.ది

వాకావారిపాలెంలో గడ్డివాములు దగ్ధం

ప్రజాశక్తి - చీరాల

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పెద్ద సంఖ్యలో గడ్డివాములు దగ్ధం అయ్యాయి. రూ.లక్షల్లో ఆస్తి నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఎస్ఐ వివి రామకృష్ణ తెలిపారు. వేటపాలెం మండలం పాపాయపాలెం పంచాయతీ వాకావారిపాలెంకు చెందిన పులి వెంకటేశ్వర్లు, పావులూరి రఘురాజు అనే ఇద్దరు రైతులకు చెందిన గడ్డి వాములపైన ఉన్న విద్యుత్ తీగల షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. రూ.7లక్షల విలువైన 35ఎకరాల గడ్డి వరిగడ్డి నష్టపోయినట్లు బాధితులు తెలిపారు.

ఉపాధి కూలీలకు రూ.600 వేతనం ఇవ్వాలి

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న టి కృష్ణమోహన్

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని పోతర్లంక, జువ్వలపాలెం, తడికలపూడి గ్రామాల్లో ఉపాధి కూలీలు పనిచేసే ప్రదేశానికి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టి కృష్ణమోహన్ పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వ్యవసాయ పనులు పూర్తిగా తగ్గిపోయాయని అన్నారు. అందువలన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు ప్రతి కుటుంబానికి 200రోజులు తప్పనిసరి పని దినాలు ఉండే విధంగా చూడాలని కోరారు. ప్రతి వ్యక్తికి రోజుకి రూ.600వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పథకం ప్రారంభంలో కూలీలకు పనిముట్లు ఇచ్చినట్లుగా యథా విధంగా ఇప్పుడు ఇవ్వాలని కోరారు. పనికి తగిన వేతనం ఎంత పడుతుందో తెలిసే విధంగా పే స్లిప్పులు ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు బొనిగల సుబ్బారావు, వేములపల్లి వెంకట రామయ్య పాల్గొన్నారు.

భట్టిప్రోలు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పని చేసే కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించి రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ డిమాండ్ చేశారు. అద్దేపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల పని ప్రదేశంలో కలసి మాట్లాడారు. కూలీల పని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే వారికి ఒక గ్రూపుకు ఒకటి లేదా రెండు వారాలకు మించి పనులు చూపించడం లేదని అన్నారు. జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి 200 రోజులు పనులు కల్పించాల్సిన బాధ్యత ఉపాధి హామీ పథకం సిబ్బందిదేనని అన్నారు. ఎక్కడ పనులు ఉన్నాయో గుర్తించి వాటిని కూలీలకు చూపించి పనులు చేయించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ఎండలు ముదిరి వడగాల్పులు వీస్తున్న దృష్ట్యా పని ప్రదేశంలో మంచినీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. మెడికల్ కిట్లు, షామియానాలు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పి మనోజ్ పాల్గొన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న ఎం సత్యనారాయణ

అద్దంకిలో గెలుపెవరిది.?

◆ గొట్టిపాటి నాలుగోసారి నెగ్గేనా? ◆ హనిమిరెడ్డికి ఆదరణ ఉందా? ◆ అద్దంకిలో గెలిచిన పార్టీ రాష్ట్రంలో ఓడిపోతుందా?

ప్రజాశక్తి - అద్దంకి

ఎన్నికలు ముగిసి 14 రోజులైంది. ఓటర్ తీర్పు ఈవీఎంలలో భద్రంగా ఉంది. గెలుపు ఓటమిపై రక రకాల విశ్లేషణలు చేస్తున్నారు. అదే సందర్భంలో ఆసక్తికరమైన ప్రశ్నలు చర్చిస్తున్నారు. సెంటిమెంటు జోడించి ఊహా గానాలు అల్లుతున్నారు. టిడిపి, వైసిపి మధ్య ప్రధాన పోటీ జరిగింది. ఇరు పార్టీల నాయకులు గ్రామాల వారిగా, పోలింగ్ బూతుల వారీగా ఓటింగ్ సరళని విశ్లేషిస్తున్నారు. నిశ్శబ్ద ఓటు ఎటువైపు ఉందనేది అంతుచిక్కక ఇరుపార్టీల అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో చాలా నియోజకవర్గాల్లో ఘర్షణలు, వివాదాలు జరిగినప్పటికీ అద్దంకిలో ఎలాంటి వివాదాలు లేకుండా 89శాతం పోలింగ్ జరిగింది. ఇతర ప్రాంతాల్లో ఉన్న ఓటర్లను ఇరు పార్టీల అభ్యర్థులు సొంత ఖర్చులు పెట్టి పోలింగుకు తరలించారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లు, ఉద్యోగులు, సాఫ్ట్వేర్ ఉద్యోగులు, మహిళలు ఎక్కువ శాతం ఓటింగులో పాల్గొన్నారు. వీరందరి తీర్పు ఎటువైపు ఉంటుందో అంచనా వేయడంలో ఆయా పార్టీల నాయకులు తర్జన భర్జన పడుతున్నారు. టిడిపి నుండి గొట్టిపాటి రవికుమార్ బరిలో ఉన్నారు. ఆయన ఈపాటికే అద్దంకి నుండి కాంగ్రెస్, వైసిపి, టిడిపి మూడు పార్టీల నుండి వరుసగా మూడుసార్లు గెలుపొందారు. అంతకు ముందు 2004లో మార్టూరు నియోజవర్గంలో కాంగ్రెస్ నుండి గెలుపొందారు. కాంగ్రెస్ నుంచి రెండుసార్లు, వైసీపీ నుంచి ఒకసారి, టిడిపి నుండి ఒకసారి గెలుపొంది మరోసారి టిడిపి నుండి గెలవడం ద్వారా ఐదోసారి శాసనసభలో అడుగు పెట్టాలనే లక్ష్యంతో ఉన్నారు. ఇప్పటి వరకు ఓటమి ఎరుగని నేతగా గుర్తింపు ఉంది. ప్రతి కుటుంబంతో వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయి. వివాద రహితుడుగా, అందరికీ అందుబాటులో ఉండే వ్యక్తిగా గుర్తింపు ఉంది. ఆయన అద్దంకిలో 4వసారి కూడా తానే గెలుస్తున్నట్లు, రాష్ట్రంలో ఎన్డీఎ కూటమి అధికారంలోకి రానున్నట్లు తమ పార్టీ శ్రేణులతో సమావేశాలు పెట్టి ఉత్సాహ పరుస్తున్నారు.

టిడిపి అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్

వైసిపి అభ్యర్థి పాణెం హనిమిరెడ్డి

అలాగే వైసిపి నుండి పల్నాడు జిల్లాకు చెందిన పాణెం హనిమిరెడ్డి పోటీలో ఉన్నారు. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సమీప బంధువు వైవి సుబ్బారెడ్డి ప్రోద్బలంతో అద్దంకి నుండి పోటీ చేశారు. ఎన్నికలకు కొత్తయినా 2009 నుండి రాజకీయాల్లో కొనసాగు తున్నారు. వైసీపీ ఆవిర్భావం నుండి ఆ పార్టీలోనే ఉన్నారు. అద్దంకి నియోజకవర్గానికి కొత్త అయినప్పటికీ తక్కువ సమయంలోనే ప్రతి గ్రామానికి చేరువయ్యారు. పార్టీని గ్రామస్థాయి నుండి బలోపేతం చేసే ప్రయత్నం చేశారు. రాజకీయ అసంతృప్తులను నివారించగలిగారు. ఆర్థికంగాను బలమైన నేతగా గుర్తింపు పొంది ఎన్నికల క్యాంపెయిన్లో అన్ని రకాల పంపిణీలను పోటా పోటీగా చేశారు. తన కృషి, జగన్మోహన్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణతో ఐదువేల ఓట్ల మెజారిటీతో గెలుస్తున్నట్లు ఆ పార్టీ శ్రేణులకు చెప్పి ఉత్సాహపరుస్తున్నారు. అంతే కాకుండా 150 సీట్లతో తిరిగి జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వస్తున్నట్లు కూడా చెబుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అద్దంకిలో ఎవరు గెలిచినా రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలోకి రాదంటూ కొంత మంది సెంటిమెంట్ ఆధారంగా ప్రచారం చేస్తున్నారు. దాని ఆధారంగానే బెట్టింగులను ప్రోత్సహిస్తున్నారు. 2014లో రాష్ట్రంలో టిడిపి గెలిచినప్పటికీ అద్దంకిలో వైసీపీ గెలిచిందని, 2019లో వైసిపి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ స్థానికంగా టిడిపి గెలిచిందని, 2009లో స్థానికంగా టిడిపి గెలిచినప్పటికీ, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఇలా పలు రకాల విశ్లేషణలు చేస్తున్నారు. దాని ఆధారంగా బెట్టింగులకు సిద్ధమవుతున్నారు. దీనికి భిన్నంగా 1983 నుండి 2019 వరకు 9సార్లు ఎన్నికలు జరిగాయని ఐదు సార్లు టిడిపి ప్రభుత్వం, మూడు సార్లు కాంగ్రెస్ ప్రభుత్వం, ఒకసారి వైసీపీ ప్రభుత్వం ఏర్పడితే 2004, 2014, 2019 ఎన్నికలు మినహా మిగతా అన్ని సందర్భాల్లోనూ ప్రభుత్వాలకు అనుగుణంగానే అద్దంకిలో అభ్యర్థులు గెలుస్తూ వచ్చారని, వ్యతిరేక సెంటిమెంటు పరిగణలోకి తీసుకోవాల్సిన అవసరం లేదని కొందరు విశ్లేషిస్తున్నారు. అభ్యర్థుల భవితవ్యం కోసం మరో వారం రోజులు ఆగవలసిందే.

డీజిల్ లేక మూగబోతున్న జనరేటర్లు

◆ పోలీసు నిబంధనలతో క్యానల్లో ఇవ్వని డీజిల్ ◆ కరెంట్ కోతలతో అల్లాడిపోతున్న రోగులు

ప్రజాశక్తి - చీరాల

ఓట్ల లెక్కింపు నేపథ్యంలో తలెత్తిన ఘర్షణలు, అల్లర్ల నివారణ చర్యల్లో భాగంగా పెట్రోల్ బంకుల్లో పెట్రోలు, డీజిల్ డబ్బాల్లో లూజు కొట్టవద్దని పోలీసులు కఠిన నిర్ణయం తీసుకున్నారు. పెట్రోలు బంకులు ఈ నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. నేరాల నియంత్రణకు ఎన్నికల కమిషన్ నిబంధనలు మంచివే అయినప్పటికీ అత్యవసర సేవలు అవసరమైన ప్రవేటు హాస్పిటల్స్, అపార్ట్‌మెంట్లలో నివాసం ఉండే వాళ్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. సినిమా థియేటర్లలో కరెంటు కోత సమయంలో జనరేటర్లకు డీజిల్ లేక చీకట్లో కాలం గడిపే పరిస్థితి ఏర్పడింది. అసలే వేసవికాలం కావటంతో కరెంటు కోతలు మొదలయ్యాయి. అపార్ట్మెంట్ వాసులు, వ్యాపార సంస్థలు, ప్రవేటు హాస్పిటల్స్‌లో కరెంటు కోత సమయంలో జనరేటర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. డీజిల్ దొరకకపోవడంతో జనరేటర్లు పనిచేయక రాత్రివేళల్లో చంటి పిల్లలు, వృద్ధులు, హాస్పిటల్స్‌లో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. రెవెన్యూ లేదా సంబంధిత శాఖల అధికారుల అనుమతులతో హాస్పిటల్స్, వ్యాపార సంస్థలు, అపార్ట్‌మెంట్లలోని జనరేటర్లకు డీజిల్ ఇవ్వాలని కోరుతున్నారు. అత్యవస సేవలను పోలీసు ఉన్నతాధికారులు, ఎన్నికల కమిషన్ పరిగణలోకి తీసుకుని డీజిల్ ఇచ్చేందుకు అవసరమైన మార్గదర్శకాలు ఇవ్వాలని కోరుతున్నారు.

హాస్పిటల్లో డిజిల్ లేక పనిచేయని జనరేటర్

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

మహాత్మా గాంధీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఎంజిసి మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ చలివేంద్రం ను టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి మద్దులూరు మాలకొండయ్య సోమవారం ప్రారంభించారు. మజ్జిగ చలివేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ రోహిణి కార్తె కావడంతో ఎంజిసి మార్కెట్ వద్ద రాకపోకలు సాగించే వారి దాహాన్ని తీర్చేందుకు ఎంజిసి వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయటం ప్రజలకు ఎంతో ఉపయోగకరం అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం చేయటం ఆనందంగా ఉందని అన్నారు. ప్రజలందరూ వేసవిలో తగు జాగ్రత్తలు తీసుకుని, తాగునీటిని ఎక్కువగా తీసుకుంటూ వైద్యుల సూచనలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న టిడిపి అభ్యర్థి కొండయ్య

ఉపాధ్యాయుల చొరవ.. గ్రామస్తుల కృషి..

- కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల
- 'పది'లో నూరుశాతం ఉత్తీర్ణత
- వసతుల కల్పన ఉపాధ్యాయుల కృషి
- తమ వంతు సహకారం అందిస్తున్న గ్రామస్తులు
- ఇదీ గుంటుపల్లి హైస్కూల్ తీరు

గుంటుపల్లి హైస్కూల్ ఇదే

ప్రజాశక్తి-పిసిపల్లి

ఆ పాఠశాల ఓ మారుమూల గ్రామంలో ఉంది. ఉపాధ్యాయుల చొరవ, గ్రామస్తుల కృషితో పాఠశాలను అన్ని హంగులతో కార్పొరేట్ పాఠశాలను తలపించేలా తీర్చిదిద్దారు. ఫలితాలు కూడా కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగానే వచ్చాయి. ఉపాధ్యాయులు కూడా చిత్తశుద్ధితో పని చేయడం, గ్రామాలకు వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయడం, పాఠశాల ప్రారంభం నుంచే ప్రత్యేక దృష్టి పెట్టి పాఠశాల అగ్రగామిగా నిలిపారు.

మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఓ మారుమూల ప్రాంతంలోని గుంటుపల్లిలో జడ్‌పి హైస్కూల్ ఉంది. ఈ విద్యా సంవత్సరంలో 58 మంది పది పరీక్షలకు హాజరయ్యారు. అందరూ ఉత్తీర్ణత సాధించారు. 586 మార్కులతో బి.షణ్ముఖరెడ్డి కనిగిరి నియోజకవర్గ స్థాయిలో టాపర్ నిలిచారు. ఈవిద్యా సంవత్సరంలో ప్రధానోపాధ్యాయుడు ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో ఎ.పోతులూరయ్య ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. గతేడాది 69 మంది పరీక్షలు రాయగా 62 మంది ఉత్తీర్ణత సాధించాడు. ఈ ఫలితాలను దృష్టిలో ఉంచుకొని గుంటుపల్లి పాఠశాల పూర్వ విద్యార్థులు పోతులూరయ్య, ఆంగ్ల ఉపాధ్యాయుడు కె.సత్యనారాయణ, జి.నరసింహారెడ్డి ప్రత్యేకంగా 10వ తరగతి విద్యార్థులపై దృష్టి సారించి మంచి ఫలితాలు సాధించారు. 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 8గంటలకు పాఠశాలకు వచ్చి ఒక గంట పాటు స్టడీ అవర్స్ నిర్వహించారు. సాయంత్రం కూడా పాఠశాల అనంతరం గంట సేపు స్టడీ అవర్స్ నిర్వహించారు. సాయంత్రం పూట విద్యార్థులకు దాదల సాయంలో పౌష్టికాహారం అందజేశారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ ద్వారా ప్రత్యేక శిక్షణ నిర్వహించారు. సాయంత్రం గ్రామంలోకి వెళ్లి తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల తెలివితేటల గురించి, ఇంటి వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పాఠశాలకు సక్రమంగా రాని విద్యార్థుల గురించి తల్లిదండ్రులకు సమాచారం అందిస్తారు. మధ్య పాఠశాల మానివేసిన విద్యార్థుల ఇంటికి వెళ్ళి వారికి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి తిరిగి బడిలో చేర్పిస్తారు.

సాఫ్ట్‌వేర్‌ను అవుతా..

బి.షణ్ముఖరెడ్డి, స్కూల్ టాపర్

4వ తరగతిలో ఉన్నప్పుడే మాతండ్రి చనిపోయాడు. దీంతో మా తల్లి రాజ్యలక్ష్మి బెంగుళూరులో పొలం పనులకు పోయి కుటు ంబాన్ని పోషిస్తుంది. అమ్మమ్మ, తాత గోచాగం విందమ్మ, తిరుపాలు వద్ద ఉండి చదువు కుంటున్నాను. భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరును అవుతా.

మంచి ఉద్యోగం సాధిస్తా..

మూల లక్ష్మీ ప్రవళ్లిక, మూలవారిపల్లి

మాది కుటుంబం వ్యవసాయ కుటుంబం. వర్షాలు లేక పంటలు పండక ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు. భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించి తల్లిదండ్రులకు అండగా నిలుస్తాం.

ఉపాధ్యాయుల సమిష్టి కృషితోనే

ఎ.పోతులూరయ్య, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు

ఉపాధ్యాయులంతా సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ ఏడాది నూరుశాతం ఫలితాలు వచ్చాయి. నియోజకవర్గ టాపర్లలో గుంటుపల్లి పాఠశాల కూడా ఒకటిగా ఉంది.

ప్రతిరోజూ స్టడీ అవర్స్

కె.సత్యనారాయణ, ఆంగ్ల ఉపాధ్యాయుడు

సాయంత్రం 6:30 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ ప్రతిరోజూ విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించారు. పరీక్షలకు మూడు నెలల ముందు నుంచే ఈ స్టడీఅవర్ నిర్వహించాం.

తల్లిదండ్రులకు అండగా ఉంటా.

ఇరిగినేని లీలావర్ధిని, కోడిగుంపుల గ్రామం.

మా తల్లిదండ్రులు గేదెలను మేపు తున్నారు. అయినప్పటికీ కుటుంబ పోషణ అంతంత మాత్రంగానే ఉంది. ఉద్యోగం సాదించి తల్లిదండ్రులకు అండగా ఉంటా.

రాహుల్‌ను అభినందిస్తున్న గుడ్ హెల్ప్ ప్రతినిధులు

రాహుల్‌కు అభినందనలు

ప్రజాశక్తి -కనిగిరి

పట్టుదల, తపన ఉంటే మనం అనుకున్న లక్ష్యం, విజయం సాధించవచ్చని సివిల్‌సర్వీస్ ర్యాంకర్ రాహుల్ నిరూ పించారని పారా లీగల్ వాలంటీర్, గుడ్‌హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు తెలిపారు. ఇటీవల సివిల్ సర్వీస్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో సివిల్ సర్వీస్ ఫలితాలలో 504 ర్యాంకు సాధించిన వంగేపురపు రాహుల్‌ను గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ మంద్రు ప్రవీణ్ కుమార్, పారా లీగల్ వాలంటీర్ గుడ్ హెల్ప్ డైరెక్టర్ రమేష్ బాబు సోమవారం అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సివిల్ సర్వీస్ ఫలితాలలో రాహుల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి కనిగిరి ప్రాంతాన్ని జాతీయస్థాయిలో నిలిపారని కొనియాడారు.రాహుల్‌ను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు సివిల్ సర్వీస్ పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. రాహుల్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే సమాజానికి సేవ చేయాలన్న కోరికతో తాను సివిల్స్‌ను ఎంచుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్లు నాగవేణి, ప్రియాంక తదిదిరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ కష్ణచైతన్య, కె. రమాదేవి

సమ్మర్ క్యాంపు ప్రారంభం

ప్రజాశక్తి -పామూరు

ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు సాంస్కృతిక కళారూపాలు ఎంతో అవసరమని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు డాక్టర్ టి.చెన్న కష్ణయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి కె. రమాదేవి అన్నారు. చిల్డ్రన్ క్లబ్,సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని పామూరు పట్టణంలోని వడ్డేపాలెం ఎంపిపి స్కూల్‌లో ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ నాయుడు తిరుపతిరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చెన్న కష్ణయ్య , ఐద్వా జిల్లా కార్యదర్శి కె. రమాదేవి మాట్లాడుతూ పిల్లలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారుఆటల్లో ముందుండాలని సూచించారు. కె.శంకర్ మాట్లాడుతూ చిల్డ్రన్ క్లబ్,సమ్మర్ క్యాంప్ ఈనెల 27 నుంచి 31 వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందుగా విద్యార్థుల చేత కేక్ కట్ చేశారు. అనంతరం క్యాంప్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగి, యుటిఎఫ్ నాయకుడు శ్రీనివాసరాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఎస్‌డి. షమీ, నాయకులు భానుమతి, మదరమ్మ ,మస్తానమ్మ, పరిమళాదేవి,అంకమ్మ, యుటిఎఫ్ నాయకుడు ఎస్‌డి.అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి అనకర్లపూడి, ముప్పరాజుపాలెం, పెరిదేపి, మిట్టపాలెం గ్రామాలకు చెందిన రైతులు 856 పొగాకు బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 767 బేళ్లు అమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 89 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.320, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.255.07పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి- హనుమంతునిపాడు

ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు ప్రభుత్వం ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని వీరరామపురం, నందనవనం గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధి పనులు పనిచేస్తూ ఏప్రిల్, మే నెలల్లో అనేకమంది కూలీలు రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బకు అనారోగ్యం పాలై మతి చెందారని తెలిపారు. కొంతమంది పని ప్రదేశంలో చనిపోగా మరి కొంతమంది ఇంటికి వచ్చి ఆరోగ్యం కీణించి ఆస్పత్రికి చేర్చే క్రమంలో చనిపోయారన్నారు. మృతులంతా కడుపేదలని, రెక్కాడితే కానీ డొక్కాడని వారని తెలిపారు. అయినప్పటికీ ప్రభుత్వం వారి ఎలాంటి ఆర్థిక సాయం అందించలేదన్నారు. మతుల కుటుంబాలను ఆదుకోవడంతోపాటు ప్రతి ఉపాధి కూలికి ప్రభుత్వం బీమా సౌకర్యం కల్పించి వారి కుటుంబాలకు భరోసా కల్పించాలన్నారు. పని ప్రదేశంలో చనిపోయిన కూలీలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జి.నాగయ్య, సౌభాగ్య లక్ష్మి, సిహెచ్.రంగయ్య, సుబ్బరాయుడు, నాగూర్, నాసర్, రంజాన్, బి. కోటయ్య పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బడుగు వెంకటేశ్వర్లు

కొండపిలో కూలీలతో మాట్లాడుతున్న కెజి. మస్తాన్

కొండపి : ఉపాధి హామీ చట్టంలో మేట్ల వ్యవస్థను పునర్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కెజి. మస్తాన్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నేతివారిపాలెం గ్రామంలో నిర్వహిస్తున్న పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్తాన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో క్రమంగా నిధులు తగ్గిస్తున్నట్లు తెలిపారు. రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని, ఫొటో హాజరు పద్ధతిని తొలగించాలన్నారు. కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. 200 పని దినాలు కల్పించాలన్నారు. మజ్జిగ, సమ్మర్ అలవెన్సులు, ప్లే స్లిప్పులు, తట్ట, పార, పొలుగు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘంనాయకులు బి.కోటేశ్వరరావు టి. అంకమ్మరావు, డి. విజయలక్ష్మి, కె. తిరుపతి స్వామి, షేక్. షకీలాబి,షేక్ మాబు ,ఆర్. సుజాత,మన్యం వెంకట్రావు, టి.వెంకటేశ్వరమ్మ, జి. లలిత ,సింగయ్య, రెబ్బవరపు కొండమ్మ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీపై రైతుల్లో అయోమయం

ప్రజాశక్తి - నిజాంపట్నం

రైతును రాజుగా చేసి చూపిస్తానని ప్రతిష్టాత్మకంగా రాష్ట్ర ప్రభుత్వం చెప్పి రైతుల కోసం ఈ క్రాప్ విధానం అమలు చేశారు. తుఫానుకు నష్టపోయిన సమయంలో రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో రైతులు ఖాతాల్లో నగదు వేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. మిచాంగ్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు రోజులు గడుస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో రైతులకు అందలేదని రైతులు వాపోతున్నారు. తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయి ఇన్‌పుట్ సబ్సిడీ అందలేదని, రైతు సమస్యలు పట్టించుకున్న నాధుడు లేడని రైతులు అంటున్నారు. ఏ ప్రాతిపదికన సబ్సిడీ చెల్లిస్తున్నారో రైతులకు అధికారులు చెప్పడం దేదని వాపోతున్నారు. తక్కువ పొలం ఉన్న రైతులకు ఎక్కువ మొత్తంలో పరిహారం వేశారని, ఎక్కువ పొలం ఉన్న రైతులకు తక్కువ పరిహారం జమ కావటంతో రైతులను అయోమయానికి గురి చేస్తుంది. 4ఎకరాల పొలం ఉన్న రైతుకు రూ.5వేలలోపు వేశారని, ఎకరంలోపు ఉన్న రైతుకు రూ.30వేలు జమ చేయడంతో అధికారులు ఏ విధంగా పంట నష్టం అంచనా వేశారో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు. కొంత మంది రైతులకు ఇప్పటి వరకు అసలు జమకాలేదని తెలిపారు. మండలంలో 12వేల ఎకరాల పంట బీమా నమోదు చేస్తే 5వేలలోపు ఎకరాలకే ఇన్‌పుట్ సబ్సిడీ అందినట్లు రైతులు చెబుతున్నారు. రైతుల సమస్యలు తీర్చాల్సిన అధికారులు పెద్దవి చేసి మనోవేదనకు గురి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొన్ని పంచాయితీల్లో పూర్తిస్థాయి ఈ క్రాప్ నమోదు చేయగా మరికొన్ని పంచాయతీల్లో ఈక్రాపు నమోదు చేయలేదని ఆరోపిస్తున్నారు. తుఫాను వల్ల పంట నష్టం జరిగిన వివరాలను ఒక పంచాయతీ పొలాలను మరో పంచాయతీలో ఈ క్రాఫ్ట్ చేసినట్లు మార్చి రైతుల్లో గందరగోళం సృష్టించారని ఆరోపించారు. అధికార పార్టీకి నచ్చిన వారికి నమోదు చేసి ఎక్కువ మొత్తాల్లో జమ చేశారని, నిజంగా నష్టపోయిన వారికి పరిహారం నామమాత్రంగా ఇచ్చారని రైతులు ఆరోపిస్తున్నారు. పంట వేసేటప్పుడు అధికారుల చేత అన్ని పంచాయతీల్లో పూర్తిస్థాయిలో ఈ క్రాప్ నమోదచేసి నిజంగా నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతుల కోరుతున్నారు. అధికార పార్టీ నేతల సిఫార్సుతో పంట నష్టం వివరాలను అధికారులు నమోదు చేశారని ఆరోపిస్తున్నారు. నిజంగా నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

తుఫాను వల్ల నష్టపోయిన పంట పొలాలు (ఫైల్‌ఫోటో)

రైతులందరికీ న్యాయం చేశాం

మండలంలో నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకున్నామని వ్యవసాయాధికారి శారద అన్నారు. 5వేల హెక్టార్ల పంట పొలాలు ఖరీఫ్ సీజన్లో ఈ క్రాప్ చేశామని తెలిపారు. తుఫాన్‌కు నష్టపోయిన పొలాలను 30శాతం కంటే ఎక్కువ నష్టపోయిన పొలాలను జియోటాగ్ ద్వారా ఆన్లైన్ చేసి సంబంధిత అధికారులకు పంపించామని అన్నారు. ఏ ఒక్క రైతుకు నష్టం జరగకుండా నమోదు చేశామని అన్నారు. పంచాయతీల వారీగా ఈ క్రాప్‌నమోదు చేసే సమయంలో ఒకటి రెండుసార్లు రైతులతో మాట్లాడినట్లు తెలిపారు. తక్కువ పొలం ఉన్న రైతుకు ఎక్కువ డబ్బులు పడటం, ఎక్కువ పొలం ఉన్న రైతుకు తక్కువ నగదు పడటం విషయం తమ దృష్టికి రాలేదని అన్నారు. పూర్తిస్థాయిలో పరిహారం జమ కాలేదని అన్నారు. నష్టపోయిన రైతులు అందరికీ ఇన్‌పుట్ సబ్సిడీ తప్పకుండా వస్తుందని అన్నారు. సాంకేతి కారణాలవల్ల కొంతమంది రైతులకు ఆలస్యంగా వస్తున్నాయని అన్నారు. మే నెల్లోపు అర్హులైన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందుతుందని అన్నారు. అప్పటికి కూడా అందని రైతులు ఉంటే ఎన్నికల నిబంధనలు ముగిసిన తర్వాత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులకు పాస్ పుస్తకంలో ఉన్న అడంగులు నెంబర్లు ప్రకారం నగదు జమవుతుందని అన్నారు. సాంకేతిక కారణాల వల్ల కొన్ని నంబర్ల రైతులకు జమ కాకపోతే పూర్తిస్థాయిలో పరిశీలించి న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు.

ప్రకృతిని కాపాడే బాధ్యత అందరిదీ..

పర్యావరణంపై గీసిన చిత్రపటాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - చీరాల

ప్రకృతి నుండి లభించే వనరులతో జీవితాన్ని సుఖమయం చేసుకునే మనం ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా మనదేనని ఎపి కాలుష్య నియంత్రణ మండలి ఒంగోలు ప్రతినిధి శవనం చంద్రారెడ్డి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థినీ, విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ, మన బాధ్యత అంశం పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రకృతి వనరులను దుర్వినియోగం చేయరాదని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పర్యావరణ కాలుష్యం పెరగకుండా జాగ్రత్తలు తీసుకుని సుస్థిర అభివృద్ధి సాధించే ప్రయత్నం చేయాలని అన్నారు. రోజు రోజుకీ ఉష్ణోగ్రతలు పెరిగిపోవడంతో వాతావరణంలో ఊహించని మార్పులు వస్తున్నాయని అన్నారు. విపరీతమైన వర్షాలు, తుఫాన్లు వంటి ప్రకృతి వైపరీత్యాలకు పర్యావరణ కాలుష్యమే కారణమని పేర్కొన్నారు. విచక్షణారహితంగా పెట్రోలియం ఉత్పత్తులు, ప్లాస్టిక్ వస్తువులు వాడటం వలన క్యాన్సర్ వంటి రోగాలు వస్తున్నాయని అన్నారు. గాలి, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అడవుల విస్తీర్ణం తగ్గిపోకుండా కాపాడు కోవాలని అన్నారు. అభివృద్ధి ఎంత ముఖ్యమో పర్యావరణ పరిరక్షణ కూడా అంతే అవసరమని అన్నారు. పోటీలో విజేతలకు జూన్ 5న జరిగే పర్యావరణ దినోత్సవ సభలో బహుమతులు అందచేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు డి ధనమ్మ, చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్ జిల్లా కో ఆర్డినేటర్ పవని భానుచంద్రమూర్తి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

అద్దంకి : వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులకు నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే ఇంగ్లీష్, తదితర పాఠ్యాంశాలు గురించి అవగాహన కల్పిస్తున్నామని గ్రంథ పాలకుడు సుగుణరావు అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లీష్, చిత్రలేఖనం తరగతులు సోమవారం నిర్వహించారు. ఫ్యాకల్టీగా సాయి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ వీరు రాజు, డ్రాయింగ్ మాస్టర్ కత్తి బాల కోటేశ్వరరావు విద్యార్థులకు వివిధ అంశాలు నేర్పించారు. డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

నిజాంపట్నం : గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని గ్రంథాలయ అధికారి ఎన్ విజయలక్ష్మి అన్నారు. వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా స్థానిక శాఖ గ్రంథాలయంలో విద్యార్థులచే పుస్తక పఠనం సోమవారం నిర్వహించారు. వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనంతోనే విజ్ఞాన వంతులుగా మారతారని చెప్పారు. ప్రస్తుత రోజుల్లో విద్యార్థులు స్మార్ట్ ఫోన్లకు, ఇంటర్నెట్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. వాటికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదని చెప్పారు. గ్రంథాలయాలను వినియోగించుకుంటే విజ్ఞానం పెరుగుతుందని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మెంబర్స్ కొల్లిపర శ్రీనివాసరావు, షేక్ తాజుద్దీన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేస్తున్న గ్రంథపాలకుడు సుగుణరావు

వ్యాస రచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వేర్వేరుచోట్ల అగ్నిప్రమాదం.. రెండు పూరిళ్లు దహనం

అగ్నిప్రమాదంలో కాలిపోయిన పూరిళ్లు

ప్రజాశక్తి - నగరం

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని పూడివాడకు చెందిన అక్కల సుందరమ్మ, అక్కల శ్రీనివాసరెడ్డికి సంబంధించిన పూరిళ్ళు పూర్తిగా కాలిపోయాయని వాపోయారు. కట్టు బట్టలతో బయట పడ్డారు. సంబధిత రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ఆస్తి నష్టాన్ని ఒక్కొక్కరికి రూ.80వేల వరకు అంచనా వేశారు.

పర్చూరు : మండలంలోని చెరుకూరులో గ్రామానికి చెందిన దాసరి శ్రీనివాసరావుకు 12 ఎకరాల విస్తీర్ణంలోని వరి గడ్డివామికి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయని స్థానికులు తెలిపారు. గమనించి వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫోన్ చేసినట్లు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. రూ.2లక్షల విలువైన పశు గ్రాసం కాలిపోయినట్లు అధికారి రామకృష్ణ తెలిపారు.

అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పశుగ్రాసం

నెహ్రూ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

నవభారత నిర్మాత నెహ్రూకు నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

ఆధునిక భారత నిర్మాణానికి స్వతంత్ర భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ పటిష్టమైన పునాదులు వేశారని గ్రంథాలయాధికారి ఎ శివాజీ గణేషన్ అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి సందర్భంగా గ్రంధాలయంలో బాల బాలికలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నెహ్రూ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. పంచవర్ష ప్రణాళికలు రూపొందించి, దేశ అభివృద్ధికి ఆయన ఎంతగానో పాటు పడ్డారని అన్నారు. ప్రపంచ శాంతికి పంచశీల సూత్రాలను ప్రతిపాదించారని అన్నారు. ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడానికి ఆయన అహర్నిశలు కృషి చేశారని అన్నారు. సోషలిస్టు తరహా సమాజాన్ని నెలకొల్పాలని కలలు కన్నారని అన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, నరసింహారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీల్ చైర్ బహుకరిస్తున్న ఘంటా అనిల్ కుమార్

వీల్‌చైర్ బహూకరణ

ప్రజాశక్తి- చీరాల

స్థానిక పద్మ భాస్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్ధురాలికి ఫౌండేషన్ చైర్మన్ ఘంటా అనిల్ కుమార్ వీల్‌చైర్ బహుకరించారు. పట్టణంలోని జయింతిపేటలో నివాసం ఉంటున్న నిరుపేద వృద్ధురాలికు అవసరమైన వీల్‌చైర్ అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలమాల మేరీసుశీల అనే వృద్ధురాలుకు ఇంటి వద్ద నడవలేక ఇబ్బందులు పడుతున్నట్లు ఆమె కుటుంబ సభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అన్నారు. ఫౌండేషన్ సేవా కార్యక్రమంలో భాగంగా వీల్‌ఛైర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వాసు బాబు, ఎడ్ల ప్రసాద్, వనమా జయ కుమార్, గొట్టిపాటి బాబురావు పాల్గొన్నారు.

పంగులూరులో మాట్లాడుతున్న ఎస్ఐ తిరుపతిరావు

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పంగులూరు

ఎన్నికల నిబంధనల నేపథ్యంలో ఎవరైనా హింసకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కెకె తిరుపతిరావు హెచ్చరించారు. సోమవారం రాత్రి పంగులూరు సెంటర్లో ప్రజలతో మాట్లాడారు. ఓట్ల లెక్కింపు రోజు ర్యాలీలు, బాణా సంచా కాల్చటం వంటివి చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. ఓట్ల లెక్కిపు రోజు 144 సెక్షన్, 30 పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని చెప్పారు. వీటిని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలతో పాటు రౌడీషీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఉండాలని సూచించారు.

పనులు పూర్తి కాకుండానే బిల్లులు మంజూరు

పర్యవేక్షణలో అధికారుల డొల్లతనం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

స్థానిక మండల పరిషత్తు కార్యాలయ భవనానికి నూతన హంగులతో రంగులు అద్ది తగిన సౌకర్యాలు కల్పించేందుకు మండల పరిషత్తు పాలకవర్గం రూ.14లక్షల నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో కార్యాలయ భవనానికి అవసరమైన మరమత్తులు చేపట్టారు. పూర్తిగా రంగులు అద్ది, లోపల టైల్స్ పరిచారు. మరుగుదొడ్లు నిర్మించారు. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గాన్ని ఏర్పాటు చేశారు. ఇలాంటి పనులతో ప్రణాళిక రూపొందించారు. ఇంత మొత్తంతో పనులు చేయడానికి టెండర్లు పిలవాల్సి ఉంది. అయితే ఆ పనులను నాలుగు విభాగాలుగా విభజించారు. నామినేషన్ పద్ధతిపై డ్వాక్రా గ్రూపు ద్వారా పనులు చేసేందుకు అధికారులు సిద్ధం చేశారు. దీనికిగాను అమృతలూరు మండలంలో ఉన్న ఒక డ్వాక్రా గ్రూపు పేరు మీద పనులు మంజూరు చేసి కాంట్రాక్టర్‌కు అప్పగించారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ పూర్తి స్థాయిలో పనులు చేయకుండానే నాశిరకం టైల్స్ నిర్మించారు. కార్యాలయ భవనానికి మసి బుసి మారేడు కాయ చేసిన విధంగా పనులు పూర్తయినట్లుగా అధికారులతో కుమ్మక్కై బిల్లులు కూడా సొమ్ము చేసుకున్నారు. కార్యాలయ భవనానికి ముందు భాగంలో రంగులు వేశారు. వెనుక ప్రాంతంలో వదిలేశారు. మరుగుదొడ్ల నిర్మాణం కూడా చేయకుండా వదిలేశారు. అలాగే కార్యాలయం చుట్టూ వర్షపు నీరు నిలబడుతుంది. కార్యాలయంలోకి నీళ్లు ప్రవేశిస్తున్న దృష్ట్యా ఈ నీటిని నూతనంగా పైపులు ఏర్పాటు చేసి బయటకు మళ్లించే విధంగా అంచనాలు రూపొందించారు. కానీ ఎలాంటి పైపుల నిర్మాణం చేయలేదు. నిర్దేశించిన పనులు పూర్తిచేస్తే రూ.14లక్షలు గుత్తేదారునికి బిల్లులు ఇవ్వాల్సి ఉంది. కానీ అంచనాల ప్రకారంగా 50శాతం కూడా పనులు జరగకుండానే రూ.10లక్షలకుపైగా నిధులు మంజూరు చేశారు. ఆ బిల్లులు చేయడానికి అధికారులకు పర్సెంటేజీలు ముట్టజెప్పి ఉంటాడనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రూ.5లక్షల విలువైన పనులు చేయకుండానే రూ.10లక్షల బిల్లులు ఏవిధంగా చేస్తారని పలువురు ఎంపిటిసీలు ప్రశ్నిస్తున్నారు.

రంగులు అద్దిన ఎంపిడిఓ కార్యాలయం ముందు భాగం

తీర్మానం లేకుండానే నిధులు మంజూరుపై ఆరోపణ

మండల పరిషత్ కార్యాలయం అభివృద్ధి పనులకు ముందుగా పాలకవర్గం ఆమోదంతో పనులు కేటాయించాల్సి ఉంది. కానీ సమావేశంతో సంబంధం లేకుండా పాలకవర్గ అధ్యక్షులు, అధికారులతో కుమ్మక్కై ఎలాంటి ఎజెండా తీర్మానం లేకుండానే సొంతగా మినిట్సు తయారు చేసుకొని కొందరు సభ్యులతో సంతకాలు చేయించి మరికొన్ని దొంగ సంతకాలు పెట్టుకుని బిల్లులు మంజూరు చేశారనే ఆరోపణలు ఎంపిటిసీలు వ్యక్తం చేస్తున్నారు. అధికార వైసిపి అండతో అధికారం తమ చేతిలో ఉందని ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరిస్తూ పనులు పూర్తి కాకుండానే కమిషన్లు అందుకొని కాంట్రాక్టరుకు బిల్లులు అందించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చేసిన పనులు కూడా నాణ్యత లోపంగా ఉన్నాయని ఆరోపిస్తున్నారు. వేసిన టైల్స్ పనులు పూర్తయి రెండు నెలలు కూడా గడవక ముందే పగిలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాణ్యత లోప భూయిష్టంగా జరిగిన పనులతో పాటు ఎలాంటి ముందస్తు అంచనాలు, తీర్మానాలు ఆమోదం లేకుండా చేసిన పనులకు మించి అధిక మొత్తంలో బిల్లులు మంజూరు చేయించిన వైనంపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సి ఉంది. పరిశీలించి సంబంధిత బాధ్యులపై చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రంగులు వేయకుండా వదిలేసిన కార్యాలయ వెనుక భాగం

ప్రవేశ ద్వారం వద్ద లేచిపోయిన టైల్స్

కందుకూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సంఘ సంస్కర్త కందుకూరికి నివాళి

ప్రజాశక్తి - బాపట్ల

మహిళాభ్యుదయమే జీవిత లక్ష్యంగా పాటుపడిన కందుకూరి వీరేశ లింగం ప్రముఖులని ప్రజాకవి, వైద్య విద్వాన్ డాక్టర్ శ్రీనివాసుల శ్రీనివాస్ పేర్కొన్నారు. కందుకూరి వీరేశలింగం 105 వ వర్ధంతి సందర్భంగా సాహితీ భారతి ఆధ్వర్యంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో కందుకూరి చిత్ర పటానికి పూలమాలవేసి సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. మహిళా విద్య కోసం కందుకూరి పాఠశాలలు నిర్మించారని అన్నారు. వితంతు పునర్వివాహాలు జరిపించి వారి జీవితాల్లో కొత్త వెలుగులు ప్రసాదించారని అన్నారు. సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ రాజశేఖర చరిత్ర అనే తొలి తెలుగు నవలను రచించిన ఘనత కందుకూరిదేనని కొనియాడారు. సామాజిక రుగ్మతలను రూపుమాపటానికి బ్రహ్మ సమాజం, హితకారిణీ సమాజాలతోపాటు వివేక వర్ధని, హాస్య సంజీవని వంటి పత్రికలను నెలకొల్పారని అన్నా రు. సాహితీ భారతి ఉపాధ్యక్షులు మర్రి మాల్యాద్రిరావు మాట్లాడుతూ కందుకూరి 150 గ్రంథాలు రచించారని అన్నారు. తన యావదాస్తిని మహిళాభ్యుదయం కోసం వెచ్చించిన త్యాగమూర్తి కందుకూరి అని శ్లాఘించారు. సాహితి భారతి కోశాధికారి ఆదం సఫీ మాట్లాడుతూ షేక్స్పియర్ రచించిన కామెడీ ఆఫ్ ఎర్రర్స్ అనే నాటకాన్ని చమత్కార రత్నావళి అనే పేరుతో తొలి తెలుగు నాటకాన్ని రచించి ప్రదర్శించారని అన్నారు. అందుకే కందుకూరి జయంతి ఏప్రిల్ 16న తెలుగు నాటక రంగ దినోత్సవంగా ప్రకటించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్ర మూర్తి పాల్గొన్నారు.

ఓట్ల సరళిపై నేతలు సతమతం

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో ఏ పార్టీకి మెజార్టీ వస్తుందోనని టిడిపి, వైసిపి నేతలు సత మతం అవుతున్నారు. మండలంలో మెజార్టీ తమదంటే తమదని ఎవరి అంచనాలతో వారున్నారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తర్వాత గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద ఆయా గ్రామాల నేతలు చర్చలు జరుపుతున్నారు. మండలంలో 51,564 మంది ఓటర్లకును 44,590 ఓట్లు పోలయ్యాయి. 86.47శాతం పోలింగు నమోదైంది. 3వేల మెజార్టీతో విజయం సాధిస్తామని టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి గొట్టిపాటి రవికుమార్ వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తుండగా 2వేలకుపైగా మెజార్టీతో తమ పార్టీ విజయం సాధిస్తుందని వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థి పానెం చిన్న హనిమిరెడ్డి వర్గీయులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా ఓటింగ్ శాతం పెరగడం, ఎక్కువగా మహిళలు రాత్రి 8గంటల వరకు లైన్లో నిలుచుని ఓటు వినియోగించు కున్నారు. సంతమాగులూరు నుండి మాజీ ఎంపిపి, మాజీ వైసిపి రాష్ట్ర కార్యదర్శి అయిన అట్లా చిన్న వెంకటరెడ్డి వర్గం వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరడంతో మండలంలో ప్రధాన నేతలు నువ్వా నేను అన్నట్లు పోటీపడ్డారు. పంచాయతీల వారీగా బూతుల్లో ఎంత పోలింగ్ జరిగింది? ఎన్ని ఓట్లు వస్తాయని లెక్కలు వేసుకుంటున్నారు. గ్రామాల్లో మెజార్టీలపై బెట్టింగులు కాస్తున్నారు. ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతతో భారీగా పోలింగ్ జరిగిందని మెజార్టీపై కూటమి నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. వైసిపి వర్గం నేతలు మాత్రం వైసిపి ప్రభుత్వం చేసిన మంచి పనులే తమకు మెజార్టీ తెచ్చిపెడుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విచ్చలవిడిగా బహిరంగ మద్యపానం

- ఎక్కడ బడితే అక్కడ మద్యం సీసాల వ్యర్థాలు
- కాల్వకట్టపైకి వెళ్లాలంటే భయపెడుతున్న మందుబాబులు

ఇంకొల్లు సాగర్ కల్వకట్టపై మద్యం సీసాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ప్రభుత్వం గ్రామాల్లో ఊరు బయట మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నప్పటికీ, మద్యం నియంత్రణ, నివారణ ప్రయోజనాలు పెద్దగా కనిపించలేదు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో ఉద్యోగులను నియమించి ఎక్సయిజ్ శాఖ ద్వారా నిర్వహిస్తుంది. అయినప్పటికీ ఎక్సైజ్ శాఖ నిబంధనలకు వ్యతిరేకంగా బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం తరచూ సేవిస్తున్నారు. గతం కన్నా ఇప్పుడు విచ్చలవిడిగా పొలాల్లోని చెట్ల కింద, కాల్వకట్టలపైన, చెరువు కట్టలపైన, రోడ్డు మలుపు ప్రాంతాల్లో, డొంక రోడ్లలో, లింకు రోడ్లలోని బ్రిడ్జిలపైన మద్యం సేవిస్తున్నారు. అనంతరం మద్యం సీసాలు, తాగేసిన ప్లాస్టిక్ గ్లాసులు ఇతర వ్యర్థాలు అక్కడే పడేస్తున్నారు. కొంత మంది సీసాలను పగలగొడుతున్నారు. మద్యం సేవించిన అనంతరం వ్యర్థాలు ఎక్కడ బడితే అక్కడ పడేస్తున్నారు. పొలాలకు పోయే రైతులు, మహిళలు, పాదచర్లకు తీవ్ర పగిలిన సీసా పెంకులు ప్రమాదకరంగా ఉన్నాయి. చెరువు కట్టల్లోను కుంటల్లోను, చెట్ల కింద ప్రయాణించే దోవల్లోను సీసాలు పగలగొట్టి వేయటం వలన గొర్రెలు, పశువుల కాపరులు ఆ కాల్వల్లో, చెరువుల్లో దిగాలన్న ఎక్కడ గాజు సీసాలు ఉంటాయోనన్న భయంతో తిరగాల్సి వస్తుంది. పొలం పనుల కోసం రోడ్లపై నడిచి వెళ్లే మహిళలకు మద్యం తాగేవారితో భయానక వాతావరణం నెలకొని ఉంది. ఇక్కడ బహిరంగంగా తాగవద్దని చెప్పిన, ఎదురు వాదనకు దిగి గొడవలు పెట్టుకున్న సందర్భాలు ఉన్నాయి. చేసేదేమీలేక వారు చూస్తూ మిన్నకు ఉండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పొలాలకు నీరు పెట్టే పంట కాల్వలో సైతం మద్యం అవశేషాలతో వేయడంతో పంట కాల్వల్లో మద్యం సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులతో నిండిపోయి సందర్శనమిస్తున్నాయి. దీనికి తోడు బెల్ట్ షాపుల నిర్వహణ కూడా పిచ్చలవిడిగానే గ్రామాల్లోని కాలనీల్లో కొనసాగుతుంది. ప్రభుత్వం ఓవైపు మద్యం నియంత్రణకు దుకాణాలను తగ్గించే విధంగా కుదించామని చెబుతున్నప్పటికీ ప్రభుత్వమే యంత్రాంగాన్ని పెట్టి నిర్వహిస్తున్నప్పటికీ ఊరు బయట ప్రదేశాల్లో షాపులు ఏర్పాటు చేసినప్పటికీ ఈ విధానంతో ఆయా కార్యకర్తలకు షాపు నిర్వహణకు సంబంధించిన అధిక అదేలు పనిచేసే యంత్రాంగానికి ఉద్యోగ అవకాశాలు కలగడమే తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదు. సేల్స్ మెన్లు, సూపర్వైజర్లు నగదు మోసలకు సైతం పాల్పడిన సందర్భాలు వివిధ దుకాణాల్లో జరిగిన సంఘటనలు ఉన్నాయి. దీనికి తోడు పోలీసు శాఖ గాని, ఎక్సైజ్ శాఖ గాని పూర్తిగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా నివారించడానికి చేపట్టే చర్యలు అంతంత మాత్రమే. మండల కేంద్రమైన ఇంకొల్లులో నాగుల చెరువు కట్ట మధ్యలో, పాత ఇడుపులపాడు డొంక, పావులూరులోని లంబాడీ డొంక బ్రిడ్జి, సాగర కాలవ కట్టపైన, కొణికి రోడ్డులోని లింకు డొంకలో, అనుమోజిపాలెం రోడ్డులోని కాల్వకట్టలపైన, లింకు డొంకల్లోనూ, పోతున వారి కుంట వద్దను, గిలకలకుంట, కందివారికొండ, ఊరు బయట మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న ప్రాంతాల్లోని కాలువ కట్టలు, లింకు రోడ్లలో విచ్చలవిడిగా మద్యం పానం చేస్తున్నారు. సీసాలు, గ్లాసులు పడవేసిన దృశ్యాలు నిత్యం సందర్శనమిస్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

కాలువలో పేరుకుపోయిన మద్యం సీసాలు, గ్లాసులు వ్యర్థాలు

మట్టి తవ్వకాలతో చెరువులో ఏర్పడ్డ లోతైన గుంటలు

ఏల్చూరులో అక్రమంగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని ఏల్చూరు వ్యవసాయ చెరువులోని మట్టి అక్రమార్కులకు కాసులు కురిపిస్తుంది. అధికారుల పర్యవేక్షణ లేక పోవడంతో మట్టి అమ్మకాల ద్వారా సొమ్ము చేసుకుంటున్నారు. చెరువులో గుట్టుగా తవ్వకాలు సాగిస్తున్నారు. అన్ని వేళలా ప్రోక్లేన్‌తో చెరువు మట్టిని ట్రాక్టర్లకు నింపి తరలిస్తున్నారు. ట్రాక్టర్ మట్టి రూ.400 దాకా పలుకుతుంది. మట్టి తవ్వేందుకు రెవెన్యూ, పంచాయితీ అనుమతులు పొందాల్సి ఉంది. కానీ ఎలాంటి అనుమతులు లేకుండానే అధికార పార్టీ నాయకుల అండతో జెసిబితో మట్టి తీసి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. చెరువులో ఈ తవ్వకాలతో పెద్ద పెద్ద గొయ్యిలు ఏర్పడుతున్నాయి. నీటి కోసం చెరువులోకి దిగిన పశువులు మృత్యువాతకు పడే అవకాశాలు ఉన్నాయి. ఈ తవ్వకాలతో రూ.లక్షలు అక్రమార్జన చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేపట్టే వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

'ఉపాధి' కూలీలకు

ప్రతి వారం పే స్లిప్పులు ఇవ్వాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రతి వారం ఉపాధి కూలీలకు ప్లేస్లిప్పులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండలంలోని బి.మాచవరంలో ఉపాధి కూలీల దగ్గరకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం ప్రతి బడ్జెట్ లోను ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గిస్తున్నారని తెలిపారు. ఈ సంవత్సరం ఉపాధి కూలీ వేతనం రోజుకి 300 రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఆ విధంగా బడ్జెట్లో అదనంగా నిధులు కేటాయించలేద న్నారు. ప్రస్తుతం రోజు కూలి 170, 180 రూపాయలు మాత్రమే పడుతున్నాయన్నారు. తమకు ప్లే స్లిప్పులు ఇవ్వకపోవడం వలన రోజుకి ఎంత వస్తున్నాయో తెలియటం లేదని ఉపాధి కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ప్లే సిప్పులు ఇవ్వాలని, రోజుకి 300 రూపాయలు కూలీ వచ్చే విధంగా చేయాలని డిమాండ్ చేశారు. కూలీలకు తట్టలు, పారలు గడ్డపారలు ఇవ్వాలని, పెరిగిన ధరలకను గుణంగా ప్రభుత్వం 600 రూపాయలు రోజుకి వేతనం ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి అన్నవరపు శేషారావు, స్థానిక కూలీలు కొండలరావు, పూర్ణ పాల్గొన్నారు.

వ్యకాసం డిమాండ్

కూలీలతో మాట్లాడుతున్న నెరుసుల వెంకటేశ్వర్లు

ఓట్ల లెక్కింపుపై అవగాహన అవసరం

- పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు అత్యంత కీలకం
- ఏఆర్ఒలు, సూపర్వైజర్లకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఓట్ల లెక్కింపు విధానంపై స్పష్టమైన అవగాహన కలిగి ఉండటంతో ఈ ప్రక్రియను ఎలాంటి లోపాలు లేకుండా నిర్వహించగలుగుతామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. కౌంటింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది ఈ విషయాల్లో అవగాహన పెంచుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా ఏఆర్ఒలు, సూపర్వైజర్లు, మైక్రో అబ్జర్వర్లు, అసిస్టెంట్లకు సోమవారం ప్రకాశం భవనంలోని స్పందన హాల్లో రెండు విడతలుగా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఏయే అంశాలను పరిశీలించాల్సి ఉంటుంది, లెక్కింపు ప్రక్రియను పారదర్శకంగా ఏవిధంగా నిర్వహించాల్సి ఉంటుందనే విషయాలపై అధికారులకు, సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, ఈ విషయంలో ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా చూసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్లను ఏ విధంగా ఓపెన్ చేయాలో, నిర్దిష్టంగా ఒక అభ్యర్థికి ఓటరు టిక్ పెట్టడంలో అస్పష్టతను ఏ విధంగా నిర్ధారించి వాటిని చెల్లని ఓట్లుగా పరిగణించాలో, ఓటరు పరోక్షంగా తన గుర్తింపును ఏ విధంగా వెల్లడించే అవకాశం ఉన్నదో, ఆయా విషయాలను ఏజెంట్ల దృష్టికి ఏ విధంగా తీసుకువెళ్లాలో కలెక్టర్ ఈ సందర్భంగా వివరించారు. ఇలాంటి అంశాలపై స్పష్టమైన అవగాహన కల్పించడానికే ఈ శిక్షణ కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. ఓటింగ్ ప్రక్రియను విజయవంతంగా అధికార యంత్రాంగం పూర్తి చేసిందని, కౌంటింగ్ కార్యక్రమాన్ని కూడా అదేవిధంగా నిర్వహించి ఈ మొత్తం ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వహించాలని కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఆర్.శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సమ్మర్ క్యాంప్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు, ఎల్‌బిజి భవన్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో భాగంగా మూడో రోజు 'ఈజీ ఇంగ్లీష్.. ఫన్నీ గేమ్స్'ను టీచర్లు బోధించారు. ఇంగ్లీషును ఆటల రూపంలో సులభంగా నేర్చుకునే విధానాన్ని భాస్కర్ శాస్త్రి, యామిని టీచర్ బోధించి విద్యార్థులను ఆకట్టుకున్నారు. అనంతరం 'సైన్స్‌తో సరదాగా..' అనే క్లాసును జనవిజ్ఞాన వేదిక నాయకులు మ్యాజిక్ రామన్ బోధించారు. చిన్నపిల్లలు సైతం చేయగలిగిన ప్రయోగాలు నేర్పించారు. ప్రజానాట్యమండలి నగర అధ్యక్షులు ఇంద్ర జ్యోతి విద్యార్థులకు పాటలు నేర్పించారు. మంగళవారం ఫన్నీ మ్యాథ్స్ క్లాసు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వినోద్ తెలిపారు.

'సైన్స్‌తో సరదాగా' క్లాసును బోధిస్తున్న రామన్

బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న

266 మందిపై కేసు

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు, ఘర్షణలు చోటుచేసుకోకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలలో భాగంగా బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చెయ్యడం జరిగిందని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆదివారం రాత్రి జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని పోలీస్ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి.. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న 266 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసులు నమోదు చేసి, కౌన్సిలింగ్ నిర్వహించారు.

పొగాకు అత్యధిక ధర రూ.320

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి సోమవారం చీమకుర్తి గ్రామ రైతులు 1220 బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 1081 బేళ్ళ కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 139 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.320 పలకగా అత్యల్ప ధర 205 రూపాయలు పలికింది.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు

అలవెన్స్ వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఇవ్వాల్సిన అలవెన్స్ వెంటనే చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యంలో మార్కాపురం సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ మీనాకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం రఫి మాట్లాడారు. మే 13న మార్కాపురం మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కమిషనర్ కిరణ్ ఆదేశాల మేరకు ఎన్నికల విధుల్లో పాల్గొనడం జరిగిందన్నారు. స్థానిక ఎస్‌వికెపి కళాశాలలో పోలింగ్ ముందు రోజు ఇవిఎంల పంపిణీ, వివి ప్యాట్‌ల ఎగుమతి, దిగుమతి, ఇవిఎంలకు స్టిక్కర్‌లు అంటించడం, సరి చేయడం వంటి పనులను రాత్రి, పగలు అని తేడా లేకుండా విధులు నిర్వహించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.హరి, కె.సుబ్బరాయుడు, షేక్ ఇమాంషా, సలాంఖాన్, ఎ.రమణ, పిఎ బ్రహ్మం, షేక్ ఇబ్రహీం, ఎం చెన్నకేశవులు, రామకష్ణ, సుభాని పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు వినతి

సబ్ కలెక్టర్‌కు అర్జీ ఇస్తున్న నాయకులు

తాగునీటి సరఫరాలో యంత్రాంగం విఫలం

సిపిఎం నగర కార్యదర్శి రమేష్ విమర్శ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారంలో నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికారులు విఫలం చెందారని సిపిఎం నగర కార్యదర్శి జి రమేష్ విమర్శించారు. సోమవారం స్థానిక సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో ఐదు రోజులకోసారి తాగునీటి సరఫరా జరుగుతోందన్నారు. ప్రజలకు చెప్పకుండా నీటి సరఫరా షెడ్యూల్‌లో మార్పులు చేశారని విమర్శించారు. శివారు కాలనీలకు ఆరు రోజులకోసారి నీరు అందుతోందన్నారు. కొప్పోలు లాంటి ప్రాంతాలలో వారానికి ఒకసారి ఇస్తున్నారని వివరించారు. వేసవి కాలంలో అవసరాలకు సరిపడా నీరు లేక, గుక్కెడు తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి నెలకొని ఉందన్నారు. పరిస్థితులను చక్కదిద్దాల్సిన పాలకవర్గం, అధికారులు సమస్య పరిష్కారం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాగునీరు ఎప్పుడు వస్తుందో ప్రజలకు తెలియని పరిస్థితిని సృష్టించారని పేర్కొన్నారు. సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో నీరు లేదని, కరెంటు సరఫరా సక్రమంగా లేదని, పైప్‌లైన్లు పగిలిపోయాయని, రకరకాల కారణాలు చెప్పి నీటి సరఫరాలో అవాంతరాలు సృష్టిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందుల పాల్జేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లోనూ, ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ నగరానికి రోజు తాగునీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని అధికార పార్టీ నేతలు హామీ ఇవ్వడం జరిగిందన్నారు. రోజూ నీటి సరఫరా మాట పక్కన పెడితే కనీసం పాత పద్ధతిలో మూడు రోజులకోసారి కూడా ప్రజలకు నీరిచ్చే పరిస్థితి లేకపోవడం దారుణమన్నారు. ప్రజలు తాగునీటి కోసం రోడ్లెక్కుతున్నా పరిపాలనా యంత్రాంగంలో చలనం లేకపోవడం సిగ్గుచేటన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి తాత్కాలిక, శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నగరంలో నీటి సరఫరా కోసం సాగర్‌నీటి మీద ఆధారపడకుండా గుండ్లకమ్మ నుంచి నీటిని తీసుకునేందుకు ఏర్పాటు చేసిన ప్రాజెక్టును వినియోగంలోకి తెస్తే సమస్యకు కొంత పరిష్కారం దొరుకుతోందన్నారు. నగరానికి రోజూ తాగునీటి సరఫరా కోసం సుమారు రూ.400 కోట్లు నిధులు కేటాయించామని పాలకులు చెబుతున్నారని, ఆ నిధులు ఏమయ్యో అర్థం కావడం లేదని విమర్శించారు. పాత పైప్‌లైన్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. కొప్పోలు, పేర్నమిట్ట చెరువులను సమ్మర్ స్టోరేజీ ట్యాంకులుగా అభివృద్ధి చేసి, ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించాలని సూచించారు. నగరంలోని బావులు, బోర్లు రిపేర్లు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. శివారు కాలనీలకు పైప్‌లైన్లు వేయాలని, ట్యాంకర్ల సంఖ్య పెంచాలని, నగరంలో మూడు రోజులకోసారి నీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తాగునీటి సమస్య పరిష్కారం విషయంలో పాలకవర్గం, అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండించారు. సమస్యపై స్పందించి ప్రజలకు సకాలంలో తాగునీరు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విలేకర్ల సమావేశంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రమేష్

మట్టి తవ్వకాలను అడ్డుకుంటున్న కూలీలు

మట్టి తవ్వకాలు అడ్డగింత..

ప్రజాశక్తి-మద్దిపాడు

గుండ్లకమ్మలో పెద్దఎత్తున మట్టిని తవ్వుతుండటంతో తమకు పనులు లేకుండా పోతున్నామని, డ్యామ్ అంతా నీళ్లతో నిండితే అవి గ్రామంలోకి వస్తాయని దీంతో గ్రామానికే ముప్పు ఏర్పడుతుందని ఉపాధి కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం మండల పరిధిలోని అన్నంగి సమీపంలో గుండ్లకమ్మలో అక్రమంగా తవ్వుతున్న మట్టి తవ్వకాలను ఉపాధి కూలీలు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి సంబంధించి ఏ విధమైన ఉపాధి పనులు చేసుకునేందుకు అనుకూలమైన ప్రదేశాలు లేకపోవడంతో రెండు రోజుల నుండి కొండ కింద పనులు చేపడుతున్నామన్నారు. తాము చేస్తున్న పనులను ధ్వంసం చేసి పని చేయడానికి వీలు లేకుండా కొందరు జెసిబిలతో మట్టిని తవ్వి పక్కనే ఉన్న చెరువుకు తరలించి చదును చేస్తున్నారని పేర్కొన్నారు. తమ గ్రామంలో 250 మంది ఉపాధి కూలీలు దీనిపైనే ఆధారపడి ఉన్నారన్నారు. గుండ్లకమ్మ ముంపులో భాగంగా కొంత పొలాలు పోయాయని, పనులు చేసుకునేందుకు ఉన్న ఏకైక మార్గం ఇదొక్కటేనన్నారు. ప్రస్తుతం ఆ పనిని కూడా చేయనీయకుండా తమ కడుపు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మామూలుగానే డ్యామ్‌లో నీళ్లు ఉంటే గ్రామ సమీపంలోని సమాధుల వరకు వస్తాయని, ఆ సమయంలో ఎవరైనా చనిపోతే ఖననం చేసేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అలాంటిది ఇప్పుడు చెరువు చదువును చేసేందుకు పెద్ద ఎత్తున గుంతలు తవ్వుతుండటంతో ఒకవేళ డ్యామ్ నిండితే ఆ నీళ్లని గ్రామంలోకి వస్తాయని చెబుతున్నారు. మట్టి తవ్వే ప్రాంతంలో పశువులు, గొర్రెలు, మేకలు నీరు తాగేందుకు వెళ్తుంటాయని, ఏదైనా ప్రమాదం జరగవచ్చని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని వారు కోరుతున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఉబ్బా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అక్రమంగా మట్టి తవ్వకాలను ఆపేందుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అధికారులు రెండు జెసిబిలను, ఒక టిప్పరును సీజ్ చేశారు. ఎస్ఐ మహేష్ తన సిబ్బందితో పర్యవేక్షించారు.